




గుంటూరు చుట్టుగుంట వద్ద అన్న క్యాంటీన్ వద్ద పనులు చేస్తున్న కార్మికులు

సీఐల బదిలీల్లో జాగ్రత్త



- తేడా వస్తే మీదే బాధ్యత
- ఎమ్మెల్యేలకు చంద్రబాబు హెచ్చరికలు
- తాజాగా పల్నాడులో మరో 10 మంది సీఐల బదిలీలు నిలిపివేత

గుంటూరు, జూలై 22 : సీఐల బదిలీల విషయంలో తేడా వస్తే మీరే బాధ్యత వహించాలి... ఈ విషయంలో ఆచితూచి వ్యవహరించండి... గడిచిన ఐదేళ్లలో వైసీపీకి అంటకాగిన వారిని దూరంగా ఉంచండి... సీఐల పోస్టింగ్స్ విషయంలో మీడియాలో విమర్శలు, ఆరోపణలు రాకుండా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోండి... అంటూ సీఎం చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మెల్యేలకు హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు చేసిన హెచ్చరికలు జిల్లాలోని ఎమ్మెల్యేలలో చర్చనీయాం శంగా మారాయి. ఇటీవల కాలంలో గుంటూరు రేంజిలో జరుగుతున్న సీఐల బదిలీల విషయంలో పత్రికల్లోనూ, పార్టీ శ్రేణుల నుంచి సోషల్ మీడియా లోనూ పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం విదితమే. మునుపెన్నడు లేనివిధంగా గడిచిన ఐదేళ్లలో పోలీస్ శాఖ విషయంలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన వైఖరి సర్వత్ర తీవ్ర విమర్శలపాలైంది. ముఖ్యంగా ఓ సామాజిక వర్గాన్ని పూర్తిగా అణిచివేయడమే గాక టీడీపీకి అనుకూలంగా ఉంటారనో, తటస్థంగా పనిచేస్తారనో భావించి అనేకమంది పోలీస్ అధికారులను వీఆర్‌లోకి పంపి కనీసం జీతాలు కూడా లేకుండా వేధింపులకు గురి చేశారు. అందులో ఒక సామాజిక వర్గం ఏక మొత్తంగా ఉండగా మిగిలిన వివిధ సామాజిక వర్గాలు వారు కూడా బాధితులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయా అధికారులతో పాటు పార్టీ శ్రేణులు, అదేవిధంగా ప్రజలు కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారందరికీ న్యాయం చేస్తారని భావించారు. అయితే ఊహించని విధంగా పార్టీ ఎమ్మెల్యేలు తీసుకున్న నిర్ణయం జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులను తీవ్ర నిరుత్సాహానికే గాక ఆగ్రహానికి కూడా గురి చేసింది. ఈ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో వైసీపీనే అధికారంలోకి వస్తుంది, జగన్ ముఖ్యమంత్రి అవుతారు, ఇంకెక్కడ తెలుగుదేశం అంటూ బహిరంగంగా వ్యాఖ్యలు చేసిన అనేకమంది సీఐలు, చివరకు ఎన్నికల సమయంలోనూ వైసీపీ గెలుపు కోసం తమ వంతు ప్రయత్నాలు చేశారు. అయితే ఆయా సీఐలకు కూటమి ప్రభుత్వంలో మిగిలిన వారి కంటే ముందుగానే సీఐల బదిలీల ప్రక్రియ కంటే ముందే పలుచోట్ల పోస్టింగ్స్ వస్తుండటంతో పార్టీ కార్యకర్తలతో పాటు ఆరోజు ఆయా అధికారులతో కలిసి పనిచేసిన పోలీస్ సిబ్బంది లోనూ సర్వత్ర విస్మయం వ్యక్తం అవుతోంది. ఇదిలా ఉంటే వారం రోజుల క్రితం పల్నాడు జిల్లాలో పదిమంది సిఐలను నియమిస్తూ ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అందులో చాలామంది గడిచిన ఐదేళ్లలో వివిధ పోలీస్‌స్టేషన్లలో సీఐలుగా కొనసాగిన వారు ఉండడంతో తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. పార్టీ శ్రేణులు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు.

మరోవైపు సోషల్ మీడియాలోనూ వీటికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లాలో నియమించిన పదిమంది బదిలీలను నిలిపివేశారు. ఈ విధంగా రేంజి పరిధిలో బదిలీల విషయంలో ఎమ్మెల్యేలు తప్పటడుగులు వేస్తుండడం వివాదాస్పదంగా మారుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు వివిధ ప్రాంతాల్లో సీఐలుగా బాధ్యతలు నిర్వహించిన వారికి కూడా ఎమ్మెల్యేలు పేర్లు ఇవ్వడం ప్రస్తుతం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయా ఎమ్మెల్యేలకు ఏ సామాజిక వర్గం వారు కావాలనుకుంటున్నారో అదే సామాజిక వర్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులకు గురైన వారికి అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. బదిలీల విషయంలో డబ్బులు అందుకున్న దళారులు మాటలు నమ్మటమో లేదంటే తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసమో లేదంటే ఎవరో సిఫార్సు చేశారని ఎమ్మెల్యేలు అటువంటి వారికి పోస్టింగ్స్ ఇప్పిస్తే ఆయా ఎమ్మెల్యేలు పార్టీ శ్రేణులకు టార్గెట్ అయ్యే అవకాశం ఉంది. ఇటువంటి పరిణామాలను ముందే గ్రహించిన సీఎం చంద్రబాబు తాజాగా బదిలీల విషయంలో ఎమ్మెల్యేలకు పరోక్ష హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సీఐల బదిలీల విషయంలో అటు ఎమ్మెల్యేలు, ఇటు అధిష్టానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని కార్య కర్తలు పార్టీ నాయకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

త్వరలో.. అన్న క్యాంటీన్లు



వైసీపీ పాలనలో అన్న క్యాంటీన్ల దుస్థితి

అవి 5 రూపాయలకే పేదలకు పట్టెడన్నం పెట్టి ఆకలి తీర్చిన అక్షయపాత్రలు కేవలం 15 రూపాయలతో మూడు పూటలా కడుపులు నింపే అన్న క్యాంటీన్లు.. అలాంటి అన్న క్యాంటీన్లు గత వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపులకు బలై పోయాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదలకు అన్నం దక్కకుండా చేసి వారిని ఆకలి, పస్తులపాలు చేశాయి. అయితే ఐదేళ్ల పాటు అన్న క్యాంటీన్లకు పట్టిన గ్రహణం త్వరలో వీడ బోతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు కసరత్తు మొదల యింది. తొలి ఐదు హామీల్లో ఒకటైన అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు పూనుకుంది. ఈ ఏడాది ఆగస్టు 15న అన్న క్యాంటీన్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కాగా గతంలో ఏర్పాటు చేసిన 183 అన్న క్యాంటీన్లను ఆగస్టు 10 నాటికి సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ ఇటీవల అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పలుచోట్ల అన్న క్యాంటీన్లకు మరమ్మతులు చేసి, రంగులు వేసి అధికారులు సిద్ధం చేస్తున్నారు.

- ఆగస్టు 15 నుంచి ప్రారంభించేందుకు కసరత్తు
- నియోజకవర్గానికి 3 క్యాంటీన్ల ఏర్పాటుపై దృష్టి
- ఇప్పటికే ప్రతిపాదనలు అందజేసిన మున్సిపాలిటీలు
- 2018లో ఉమ్మడి జిల్లాలో 29 ఏర్పాటు
- శిథిలమైన క్యాంటీన్లను పునర్నిర్మిస్తున్న అధికారులు

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేలాది మంది పట్టణ పేదల ఆకలి తీర్చేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం 2018 జూలై 11న అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. జిల్లాలోని 13 నగర, పురపాలక సంఘాల్లో మొత్తం 29 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ప్రతి రోజూ వేలాది మంది పట్టణ పేదలకు రూ. 5 రూపాయలకే టిఫిన్, భోజనం లభించేది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చే దినసరి కూలీలకు మధ్యాహ్నం ఈ అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చేవి. పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారికి కూడా మధ్యాహ్నం పూట అన్న క్యాంటీన్లలో రూ. 5కే అన్నం లభించడంతో వారికి కూడా ఆర్థికభారం తప్పేది. ఇలా ప్రతి రోజూ ఒక్కో అన్న క్యాంటీన్ 1500 నుంచి 2000 వేలమందికిపైగా ప్రజలకు ఆకలి తీర్చేవి. వీధులవెంట, రైల్వేస్టేషన్లు, బస్టాండుల్లో జీవించే నిరాశ్రయులు, నిరుపేదలు, భిక్షాటకులకు కూడా అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చేవి.

- గుంటూరులోని మిర్చియార్డులో, గోరంట్ల ఐడీ ఆసుపత్రి వద్ద, చిలకలూరిపేటలో రెండు చోట్ల, నరసరావుపేటలో రెండు చోట్ల, తెనాలిలో రెండు చోట్ల, రాష్ట్ర హైకోర్టు, సచివాలయం, కరకట్ట వద్దనున్న ముఖ్యమంత్రి నివాసం సహా జిల్లాలో 13 పట్టణాల్లో 29 అన్నా క్యాంటీన్లను గత టీడీపీ ప్రభుత్వం 2018లో ప్రారంభించింది. కాగా వైసీపీ ప్రభుత్వం వాటన్నింటినీ పాడుబెట్టింది. ఫలితంగా అనేక చోట్ల క్యాంటీన్లు శిథిలమైపోయాయి. కొన్నింటిని సచివాలయాలుగా మార్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటన్నింటినీ తిరిగి ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోంది. పాడుబడిపోయిన భవనాలకు రంగులు వేసి మున్సిపల్ అధికారులు కొత్త రూపురేఖలు తెస్తున్నారు. శిథిలమైనవాటిని పునర్నిర్మిస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని అన్ని ప్రధాన పట్టణాలు, నగరాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఒక్కో నియోజకవర్గ పరిధిలో 3 అన్న క్యాంటీన్లు ఉండేలా చర్యలు చేపడుతోంది. ఆగస్టు 15 నుంచి వాటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరగా, స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో బస్టాండు సెంటర్లో ఒకటి, ఆటో నగర్‌లో ఒకటి, మార్కెట్ సెంటర్లో ఒకటి, పశ్చిమ నియోజకవర్గంలో మిర్చియార్డులో ఒకటి, చుట్టుగుంటలో ఒకటి, గుజ్జనగుండ్లలో ఒకటి, మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాలలో ఒకటి చొప్పునఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.




గుంటూరు బస్టాండు వద్ద అన్న క్యాంటీన్‌ను మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ధ్వంసం చేసిన వైసీపీ ప్రభుత్వం

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను తాను కొనసాగిస్తానని, తన తండ్రి పేరుతో వాటిని రాజన్న క్యాంటీన్లుగా నడుపుతానని చెప్పిన గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని మూసేశారు. అధికారంలోకి వచ్చిన రోజుల్లో రంగులు మార్చి అన్న క్యాంటీన్ పేరును రాజన్న క్యాంటీన్‌గా మార్చి హడావుడి చేసినా, ఆ తరువాత వాటిని నిర్దాక్షిణ్యంగా మూసేశారు. దీంతో పేదలకు పట్టెడన్నం కూడా లభించడం గగనమైపోయింది. టీడీపీ నేతలు కొందరు తమ వ్యక్తిగత చొరవతో సొంత డబ్బులతో ఏర్పాటు చేసినా వాటిని అక్కసుతో వైసీపీ నేతలు కూల్చేశారు. పేదల నోటి దగ్గర కూడు లాగేశారు. దీనిపై విమర్శలు పెద్ద ఎత్తున వెల్లువెత్తడంతో ప్రభుత్వం కొంత వెనక్కి తగ్గింది. దీంతో గుంటూరులో 4 చోట్ల, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, చిలకలూరిపేట సహా అనేక పట్టణాల్లో టీడీపీ నేతలు సొంత ఖర్చుతో అన్న క్యాంటీన్లు నడిపారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వం తిరిగి అన్న క్యాంటీన్ల కొనసాగింపుకు చర్యలు చేపడుతోంది.





తెరచాటు దోస్తీ.. పదవి కోసం కుస్తీ

- నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ నేతల ఆరాటం
- అనర్హులే రేసులో ముందంజ
- పార్టీలో సభ్యత్వం లేకున్నా జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కావాలంట
- అదేమంటే కులం కార్డు ప్రయోగిస్తూ బెదిరింపు
- మోపిదేవి, రజినీతో అంటకాగిన నేతలపై లోకేశ్ గుర్రు
- ఎంపీ అభ్యర్థుల వద్ద మాత్రం ఫొటోలకు ఫోజులు
- పనిచేయని వారికి పదవులు ఎలా అంటున్న ఎమ్మెల్యేలు

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో నామినేటెడ్ పదవుల కోసం నేతల తాకిడి ఎక్కువైంది. ఎక్కడ ఇద్దరు ముగ్గురు నాయకులు తారసపడ్డా ప్రస్తుతం ఇదే అంశంపై చర్చ నడుస్తుంది .చివరకు మండల స్థాయిలోని చోటామోటా నాయకులు కూడా రాబోయే పదవుల మీద ఊహాగానాలు చేస్తున్నారు .తెలుగుదేశం పార్టీలో ఈసారి నామినేటెడ్ పదవు లు కోరే నేతల జాబితా చాంతాడు లా పెరిగిపోయింది 2019 ఎన్నికల తర్వాత పార్టీని అంటిపెట్టుకొని ఉన్న నేతలతో పాటు, అటు ఇటు పక్క చూపులు చూసిన వారు కూడా నామినేటెడ్ పదవుల కోసం పోటీలోకి రావటం చర్చనీయాంశంగా మారింది . వాస్తవానికి కొందరు నేతలు గత ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బం దులు పడ్డారు. అనేక రకాల అక్రమ కేసులను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగి తెలుగు దేశం పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు . పార్టీ కోసం సొంత డబ్బు ఖర్చు చేసి మరీ విజయానికి కృషి చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవుల కోసం తెలుగుదేశం పార్టీ సన్నాహాలు చేస్తుందన్న వార్తలు అటువంటి నాయకుల్లో ఆనందాన్ని కలిగించాయి. ఆయా నాయకులు వారి వారి స్థాయికి తగ్గట్టుగా పదవులను ఆశిస్తూ స్థానిక ఎమ్మెల్యేలకు మనసులోని మాటను చేరవేశారు. కొంతమంది ఎమ్మెల్యేలు వారి పరిధిలోని నాయకులకు పదవులపై క్లారిటీ కూడా ఇచ్చారు. ఆ మేరకు అధిష్టానానికి లేఖలు కూడా రాసినట్లు తెలుస్తోంది. అయితే గత ఎన్నికల తర్వాత కొంతమంది నేతలు వైసీపీ ముఖ్య నేతలతో టచ్ లోకి వెళ్లారు. గడచిన ఐదేళ్లు ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో వారితో సంబంధాలను పెట్టుకున్నారు . తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి పొత్తు ఖరారు అయిన తర్వాత అటు వంటి నేతలు తిరిగి సైకిల్ వైపు చూశారు. ప్రస్తుతం పదవులు ఆశిస్తున్న వారిలో అటువంటి వారే ఎక్కువగా పావులు కదుపు తున్నారన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తం అవుతున్నది.

పనిచేయని వారికి నో ఛాన్స్

గత ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో ఎవరెవరు ఎంత మేరకు పనిచేశారు అనేది ఎమ్మెల్యేలకు పూర్తిగా అవగాహన ఉంది. కొంత మంది నేతలు ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో పని చేయకుండా కేవలం ఫోటోలుకే పరిమితం అవుతూ వచ్చారు. ఓటర్లను కలిసి ఎక్కడా కూడా వారిని ప్రభావితం చేసిన పరిస్థితులు లేవన్నది కొంతమంది ఎమ్మెల్యేల వాదన. అటువంటి వారికి పదవులు ఇస్తే ఊరుకునేది లేదని వారు తెగేసి చెబుతున్నారు. పనిచేయని వారికి పదవులు ఇస్తే పనిచేసిన కార్యకర్తల పరిస్థితి ఏమిటని ఎమ్మెల్యేల వాదన. కొందరు నాయకులు ఎన్నికల్లో కేవలం ఎంపీ అభ్యర్థులు వచ్చినప్పుడు మాత్రమే ఫొటోల్లో కనపడుతూ వచ్చారు. ఆ తర్వాత ఎమ్మెల్యే అభ్యర్థుల కోసం పనిచేసిన దాఖలాలు లేవని తెలుస్తుంది. అటువంటి వారికి పదవులు ఇచ్చే విషయంలో పార్టీ అధిష్టానం ఏ విధంగా ముందుకు వెళుతుంది అనేది అర్థం కాని సంగతి. కొందరు టీడీపీ నేతలకు గతంలో వైసీపీ ఎంపీ మోపిదేవి రమణతో వ్యాపార సంబంధాలు ఉన్నాయనేది ఆరోపణ. అలాగే అప్పటి మంత్రి రజినీతో అంటకాగిన వారు ఉన్నారు. ప్రస్తుతం ఇతర పార్టీ నేతలతో వ్యాపార సంబంధాలు నెరపే వారు కూడా ఉన్నారు. అయితే సదరు సమాచారం నారా లోకేశ్ వద్ద ఉన్నట్లు వినికిడి. ప్రస్తుతం ఆ నేతల్లో ఒకరు ఎమ్మెల్సీ పదవి కోసం ప్రయత్నిస్తుండగా...అతని దరఖాస్తు కంటే ముందే.. అతని ప్రత్యర్థులు ఫిర్యాదులు అధిష్టానానికి చేరినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల వెంట కొందరు నేతలు తిరు గుతూనే శల్యసారథ్యం వహించారు... గుంటూరుపశ్చిమలో అయితే కొందరు టీడీపీ నేతలు వైసీపీ అభ్యర్థిగా ఉన్న మంత్రి రజినీతో లోపాయి కారీ ఒప్పందాలు పెట్టుకున్నారు. ఈ సమాచారం ఎమ్మెల్యే మాధవి దృష్టిలో ఉండటంతో నామినేటెడ్ పదవుల విషయంలో తమకు న్యాయం జరగదేమోననే ఆం దోళనలో నేతలు ఉన్నారు.

పార్టీ సభ్యత్వం లేకున్నా..

సాధారణంగా ఏ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి పొందాలన్న ఆయా వ్యక్తులు ఎంతో కాలంగా పార్టీలో కష్టపడి పనిచేసిన వారై ఉండాలి. గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కోసం ఈ మధ్యకాలంలో ఒకరు దరఖాస్తు చేసినట్లు తెలుస్తున్నది .ఆయనకు కనీసం పార్టీ సభ్యత్వం కూడా లేకపోవడం గమనించదగ్గ విషయం. అయితే సదరు వ్యక్తి జిల్లా అధ్యక్ష పదవి పొందేందుకు కులం కార్డును బలంగా ప్రయోగిస్తున్నట్లు సమాచారం. అటువంటి వ్యక్తులకు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఎలా ఇస్తారని మిగిలిన నాయకులు ప్రశ్నిస్తున్నారు.

వడపోత జరిగేనా..

సాధారణంగా తెలుగుదేశం పార్టీలో నామినేటెడ్ పదవుల కోసం ఎప్పుడూ పోటీ ఎక్కువగానే ఉంటుంది. అయితే భారీ వడపోత తర్వాత పదవులను కేటాయించడం ఆనవాయితీగా వస్తుంది. అయితే ఈసారి వడపోత జరుగుతుందా లేదా అనేది చాలామందిలో సమాధానం దొరకని ప్రశ్నగా కనిపిస్తుంది . ప్రస్తుతం నామినేటెడ్ పదవులకు దరఖాస్తు చేసిన వారిలో అనర్హులే ఎక్కువ మంది ఉండటంతో ఈ ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. ఒకవేళ అర్హులను పక్కనపెట్టి అనర్హులకు పదవులు దక్కితే ఏమిటన్న సందేహం కార్యకర్తల్లో కనపడుతున్నది . అయితే సీఎం చంద్రబాబు నాయుడు మాత్రం ఆయా మార్గాల ద్వారా జిల్లాలో నామినేటెడ్ పదవులకు అర్హులైన వారి వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం.

దోమల వ్యాప్తి నివారణకు చర్యలేవి..



- వర్షాలతో పెరిగిన దోమలు
- మేల్కొనకపోతే ప్రమాదమే
- కట్టడికి కదలని మున్సిపల్ సిబ్బంది

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారుల్లో.. ఖాళీ స్థలాలు.. గుంతల్లో నీరు నిలిచింది. దీంతో దోమల వ్యాప్తి పెరిగింది. మున్సి పాలిటీ, పంచాయతీల అధికారులు తక్షణం చర్యలు తీసుకోకుంటే జనం రోగాలబారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికే పలు గ్రామాలు, పట్టణాల్లో జ్వరాల కేసులు వెలుగు చూస్తున్నాయి. అక్కడక్కడ డెంగీ, వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమం ఆశించిన స్థాయిలో ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయినా.. తొలగించే పరిస్థితి లేదు. పురపాలక సం ఘాల్లో ప్రజారోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దోమల నివారణకు నిధులు కేటాయించడం లేదు. మురుగు కాలువలు పూడికతో నిండాయి. పూడిక తీసేందుకు మునిసిపాల్టీలు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు అంతగా కనిపించడం లేదు. మున్సి పాలిటీలు, పంచాయతీల పరిధిలో దోమల నివారణకు చేయాల్సిన ఫాగింగ్ జరగడం లేదు. ఫాగింగ్ యంత్రాలను మూలన పడేశారు. అన్ని మునిసిపాల్టీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఫాగింగ్ పేరు తో తిప్పే వాహనాల కు ఇంధనం కోసం బోగస్ బిల్లు లు తయారుచేసి అక్రమాలకు పాల్పడుతున్న సంఘ టనలున్నాయి.



నరసరావుపేట మున్సిపాలిటీలో పాడుబెట్టిన పాగింగ్ యంత్రం

కానరాని ప్రత్యేక కార్యక్రమాలు

తెలుగుదేశం ప్రభుత్వం ఉన్న 2014-19 మధ్య కాలంలో 'దోమలపై దండ యాత్ర' పేరుతో నివారణ చర్యలు మునిసి పాల్టీలు చేపట్టేవి. ఇవి ప్రజలను ఎంతో ఆలోచింప చేసేవి. ప్రతి శుక్రవారం డ్రై డే.. డ్రై డే నిర్వహించేవారు. దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి.. నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకునేవారు. నీటి తొట్టెలు, పాత్రలను తెరిచి ఉంచడం, టెంకాయ చిప్పలు, టైర్లలో నీరు నిలిచి ఉండటం తదితరాలతో వచ్చే అనర్థాలను జనాలకు వివరించే వారు. నీటి గుంతల్లో దోమల వ్యాప్తి నివారణకు అయిల్ బాల్స్ వేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించే వారు. ప్రస్తుతం ఇలాంటివి కనిపించడంలేదు. కనీసం క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంది.. కేసులు వచ్చిన చోట ఏం చేయాలి.. భవిష్యత్తు కార్యచరణ ఏమిటి.. అనే ఆలోచన మునిసిపల్ యంత్రాగానికి లేకపోవడం గమనార్హం.

ఎన్‌డీబీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యేనా!

- రూ.35.96 కోట్ల నిధులు బూడిదలో పోసిన పన్నీరే
- రెండేళ్ల అగ్రిమెంట్ సమయం ముగిసినా పూర్తికాని పనులు

7లో..

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు

- రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు ఉండొచ్చని అంచనా
- నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్

ఏటా 78.5 లక్షల కొలువులు కావాలి



ఆర్థిక సర్వే పలు కీలక అంశాలను ప్రభుత్వం ముందుంచింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి కల్పన కీలకమని స్పష్టం చేసింది. ఇందుకోసం 2030 వరకు వ్యవసాయేతర రంగాల్లో ఏటా 78.5 లక్షల ఉద్యోగ/ ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంటుందని తెలిపింది. ఉద్యోగాల కల్పన ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని స్పష్టం చేసింది. ప్రైవేటు రంగమూ ఇందుకు కలిసి రావాలని కోరింది. పెద్దఎత్తున లాభాలు ఆర్జిస్తున్నా ప్రైవేటు కంపెనీలు కొలువుల కల్పనపై పెద్దగా ఆసక్తి చూపకపోవడాన్ని తప్పుపట్టింది. గత మూడేళ్లలో దేశంలోని 33,000 కంపెనీల స్థూల లాభాలు నాలుగింతలు పెరిగినా, ఆ కంపెనీల్లో ఉద్యోగాల కల్పన మాత్రం పెద్దగా లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. అలాగే దేశ జనాభాలో వ్యవసాయ రంగంపై ఆధారపడేవారి సంఖ్య క్రమంగా తగ్గుతున్న విషయాన్ని గుర్తు చేసింది. 2023 నాటికి దేశ జనాభాలో 48.5 శాతం మంది తమ జీవనోపాధి కోసం ఈ రంగంపై ఆధారపడి ఉంటే, 2047 నాటికి ఇది 25 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది.

రాష్ట్రాలూ కలిసి రావాలి

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వాలదీ కీలక పాత్ర అని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇందుకోసం రాష్ట్రాలు భూ చట్టాలు, కార్మిక చట్టాలను సవరించాలని కోరింది. కొన్ని రాష్ట్రాలు కొత్త కార్మిక చట్టాలకు, పాత కార్మిక చట్టాల్లోని నిబంధనలు జోడించడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. కంపెనీలకు భారంగా మారిన కొన్ని నియంత్రణలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరింది. కొత్త కార్మిక చట్టాలను కొన్ని రాష్ట్రాలు ఇంకా పూర్తి స్థాయిలో అమలు చేయక పోవడడాన్ని తప్పుపట్టింది. సులభతర కార్మిక చట్టాల ద్వారా ఆర్థిక వృద్ధి రేటు మరింత జోరందుకుంటుందని తెలిపింది.

వ్యవసాయంలో తక్షణ సంస్కరణలు

వ్యవసాయ రంగంలో తక్షణం సంస్థాగత సంస్కరణలకు సమయం ఆసన్నమైందని ఆర్థిక సర్వే పేర్కొంది. లేకపోతే మన వ్యవసాయ రంగంలో ఉన్న పూర్తి స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోలేమని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ రంగంలో సంక్షోభమైతే లేదని పేర్కొంది. అయితే వాతావరణ మార్పులు, ముందు ముందు ఎదురయ్యే నీటి కొరతలను దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో వెంటనే సంస్థాగత మార్పులు చేపట్టాలని సూచించింది. ఆగ్నేయాసియా దేశాలు, అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే, మన వ్యవసాయ రంగం ఇంకా వెనుకబడే ఉందని తెలిపింది. సాగునీరు, ఎరువులు, విద్యుత్ వంటి వాటిపై సబ్సిడీలతో పాటు వ్యవసాయ ఆదాయానికి పన్ను మినహాయింపు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) వంటి మద్దతు చర్యలు ఉన్నా, మన వ్యవసాయ రంగంలో మరిన్ని విధానపరమైన సంస్కరణలకు అవకాశం ఉందని సర్వే ముందు మాటలో కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ తెలిపారు. ఆహార ద్రవ్యోల్బణ నియంత్రణ, రైతుల పంటలకు సరైన గిట్టుబాటు ధరల కల్పన, చిన్న కమతాల సమస్య పరిష్కారం మన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాళ్లని ఆర్థిక సర్వే తెలిపింది. ప్రస్తుత ఆహార భద్రత విధానం నుంచి పోషకాహార భద్రత వైపు మరలాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపింది. డిమాండ్ ఆధారిత ఆహార విదానాన్ని సర్వే సూచించింది.

ఆర్థిక సర్వే 2023-24

ఏఐతో కుదుపు తప్పదు

కొన్ని రంగాల్లోని ఉద్యోగాలపై కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం తప్పదని ఆర్థిక సర్వే హెచ్చరించింది. భవిష్యత్‌లో అన్ని రంగాల్లోని ఉద్యోగాల స్వరూప, స్వభావాలను ఏఐ మార్చి వేస్తుందని తెలిపింది. అయితే అన్ని రకాల ఉద్యోగులు, కార్మికుల నైపుణ్యాలపై ఏఐ ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై ఇంకా స్పష్టత లేదని పేర్కొంది. ఉత్పాదకతను భారీగా పెంచే ఏఐ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే మార్చివేసే అవకాశం ఉందని అంచనా వేసింది. విద్యుత్, ఇంటర్నెట్ లానే.. ఏఐ కూడా నిత్య జీవితంలో తప్పనిసరిగా మారుతోందని తెలిపింది. ఏఐ కారణంగా కస్టమర్ సర్వీసెస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ పెరిగి ఉద్యోగాలు పోతాయని హెచ్చరించింది. అయితే ఇమేజ్, వీడియోల చిత్రీకరణ వంటి సృజనాత్మక రంగాల్లో ఏఐ టూల్స్‌ని విరివిగా ఉపయోగిస్తారని అంచనా వేసింది. ఏఐ ట్యూటర్ల కారణంగా విద్యా రంగంలోనూ మార్పులు తప్పవని పేర్కొంది. ఏఐ కారణంగా కొత్త ఔషధాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని సర్వే తెలిపింది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న ఏఐ టెక్నాలజీని మన దేశం ఎంత మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని కోరింది.

చైనా నుంచి మరింత ఎఫ్‌డీఐ

చైనా నుంచి మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డీఐ)లు ఆకర్షించేందుకు దృష్టి పెట్టాలని ఆర్థిక సర్వే ప్రభుత్వాన్ని కోరింది. ఇలా చేయడం ద్వారా అమెరికా, ఈయూ వంటి దేశాలకు మన ఎగుమతులు మరింత పెంచుకోవచ్చని సూచించింది. ప్రస్తుతం ఈ దేశాలు 'చైనా వన్ ప్లస్' వ్యూహంలో భాగంగా తమకు అవసరమైన వస్తు, సేవల కోసం భారత్ వంటి దేశాలవైపు చూస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. చైనా ఎఫ్‌డీఐని సరళీకృతం చేస్తే, ఆ దేశ కంపెనీలు మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేసుకుని, మన దేశం నుంచి తమ సరుకులను అమెరికా, ఈయూ దేశాలకు ఎగుమతి చేయగలుగుతాయని తెలిపింది. గల్వాన్ ఘర్షణల తర్వాత చైనా కంపెనీలు భారత్‌లో పెట్టే పెట్టుబడులను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. దీనికి తోడు చైనా కంపెనీలు కూడా మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేయడం కంటే, తమ సరుకులను చౌకగా దిగుమతి చేయడంపైనే ఆసక్తి చూపిస్తున్నాయి. అమెరికా, ఈయు,సింగపూర్, జపాన్, కొరియా వంటి దేశాల నుంచి మన దేశానికి పెద్ద ఎత్తున ఎఫ్‌డీఐ వస్తోంది. గత పాతికేళ్లలో మన దేశానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో చైనా వాటా కేవలం 0.37 శాతం (250 కోట్ల డాలర్లు) మాత్రమే. ఈ నేపథ్యంలో ఆర్థిక సర్వే చైనా నుంచి మరింత ఎఫ్‌డీఐకి ప్రయత్నించాలని సూచించడం విశేషం. అయితే కీలకమైన వ్యూహాత్మక ఖనిజాల కోసం చైనాపై ఆధారపడడం ఏ మాత్రం మంచిది కాదని సర్వే స్పష్టం చేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,850 ▼	67,700 ▼	96,000 ▼
ముంబై	73,218 ▼	67,068 ▼	88,196 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	520
వరంగల్	522	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	117
వరంగల్	112	గుంటూరు	118
కరీంనగర్	112	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	129
కర్నూలు	112	నెల్లూరు	129
విశాఖపట్నం	106	అనంతపురం	117
గోదావరి	117		

వికసిత్ భారత్‌కు ఆరంచెల వ్యూహం

ఈ ఏడాది వృద్ధి 6.5%

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి వృద్ధి రేటు అంచనాను కుదించింది. ప్రపంచంలో పెరిగిన భౌగోళిక, రాజకీయ సంఘర్షణల ప్రభావం వృద్ధి రేటుపై పడుతుందని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరపు వృద్ధి రేటు అంచనాను 6.5 శాతం నుంచి 7 శాతానికే పరిమితం చేసింది. వడ్డీ రేట్లను నిర్ణయించే సమయంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకూడదని సూచించింది. ఆర్థిక వ్యవస్థలో మరిన్ని ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉన్నదంటూ ఎగుమతులు ఉత్తేజితం చేయడానికి చైనా నుంచి మరిన్ని ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణకు మద్దతు ప్రకటించింది. ప్రస్తుత అమృత కాలానికి, 2047 నాటికి వికసిత్ భారత్ సాధనకు ఆరంచెల వ్యూహాన్ని ప్రతిపాదించింది. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ రూపొందించిన 2023-24 ఆర్థిక సర్వే నివేదికను ఆర్థిక మంత్రి నిర్మల సోమవారం పార్లమెంటుకు సమర్పించారు. విభిన్న అంశాలపై ఆర్థిక సర్వే ప్రకటించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.



వృద్ధికి ప్రపంచ సవాళ్ల అవరోధం

ఈ ఏడాది వృద్ధి రేటు 6.5 శాతం నుంచి 7 శాతం మధ్యన ఉండవచ్చు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన 8.2 శాతం వృద్ధిరేటు కన్నా ఇది తక్కువే. అలాగే ఆర్‌బీఐ ప్రకటించిన అంచనా 7.2 శాతం కన్నా కూడా తక్కువ. ఈ ఏడాది సాధారణ వర్షపాతం ఉండవచ్చని వాతావరణ పరిశోధనా శాఖ అంచనా. నైరుతి రుతుపవనాల గమనం ఇప్పటివరకు సంతృప్తికరంగానే ఉంది. దీనివల్ల వ్యవసాయ రంగం పనితీరు మెరుగుపడి గ్రామీణ ప్రాంతాల్లో డిమాండు పెరగవచ్చు. జీఎస్‌టీ, ఐబీసీ వంటి వ్యవస్థాత్మక సంస్కరణలు కూడా సత్ఫలితాలనిస్తున్నాయి. అయితే ప్రపంచ స్థాయిలో పెరిగిన భౌగోళిక, రాజకీయ సంఘర్షణలు వృద్ధికి సవాలు విసురుతున్నాయి. వీటి ప్రభావం వల్ల సరఫరా వ్యవస్థలో అంతరాయాలు పెరగవచ్చు. కమోడిటీ ధరలు కూడా పెరిగి ద్రవ్యోల్బణ ఒత్తిడులకు కారణం కావచ్చు. ఫలితంగా ద్రవ్య విధాన సడలింపు సైతం జాప్యం అయ్యే ఆస్కారం ఉంది.

రిటైల్ ఇన్వెస్టర్ల హల్‌చల్...తస్మాత్ జాగ్రత

స్టాక్ మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెరిగింది. రిటైల్ భాగస్వామ్యం పెరగడం మాత్రం ఆహ్వానించదగ్గ అంశమే. దీని వల్ల వారు పొదుపు మొత్తాలపై అధిక రాబడులు పొందగలుగుతారు. వారి రాకతో పెట్టుబడి మార్కెట్లలో స్థిరత్వం వచ్చినా వాస్తవిక మార్కెట్ పరిస్థితులతో ప్రమేయం లేకుండా అధిక రాబడులకు ఆశ పడి అతి విశ్వాసంతో పెట్టుబడులు పెడుతూ పోవడం మాత్రం ఆందోళనకరం. ప్రధానంగా డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో వారి ఆసక్తి పెరగడంపై ఒక కన్నేసి ఉంచాలి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ నగదు విభాగం టర్నోవర్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 35.9 శాతానికి పెరిగింది. దేశంలోని రెండు డిపాజిటరీల వద్ద నమోదైన డీమ్యాట్ ఖాతాల సంఖ్య 1145 లక్షల (2022-23 ఆర్థిక సంవత్సరం) నుంచి 1514 లక్షల కోట్లకు (2023-24 ఆర్థిక సంవత్సరం) పెరిగింది. ఎన్‌ఎస్‌ఈలో నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య 2020 మార్చితో పోల్చితే 2024 మార్చి 31 నాటికి 9.2 కోట్లకు పెరిగింది. అంటే 20 శాతం మంది గృహస్థులు తమ పొదుపును ఆర్థిక మార్కెట్లకు తరలించారు. "ఈ పరిణామాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించాలి. మితిమీరిన విశ్వాసంతో స్పెక్యులేషన్‌కు పాల్పడే ప్రమాదం అధికంగా ఉంది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి". ప్రధానంగా మ్యూచువల్ ఫండ్ల మార్గంలో రిటైల్ భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. 2024లో ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.14 లక్షల కోట్లు (35 శాతం)పెరిగి రూ.53.4 లక్షల కోట్లకు చేరింది.

డెరివేటివ్స్ జోలికి పోవద్దు

మానవుల్లో సహజసిద్ధంగా ఉండే జూద లక్షణంతో రిటైల్ ఇన్వెస్టర్లు ఎఫ్ అండ్ ఓ విభాగంలో ప్రవేశిస్తున్నారు. అతి తక్కువ తలసరి ఆదాయం ఉన్న భారత్ వంటి వర్ధమాన దేశంలో స్పెక్యులేటివ్ వ్యాపారాలకు తావుండకూడదు. స్టాక్ మార్కెట్లలో ఏ మాత్రం కరెక్షన్ ఏర్పడినా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఎవరో కనిపించని వ్యక్తులు తమను మోసం చేశారన్న భావన వారిలో పెరిగి దీర్ఘకాలం పాటు పెట్టుబడి మార్కెట్ల వైపు చూడకపోవచ్చు.

ఆహార ద్రవ్యోల్బణంపై ఫోకస్ తగ్గించాలి

వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకునే సమయంలో ఆర్‌బీఐ ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకునే వైఖరి మార్చుకోవాలి. అధిక ఆహార ధరల నుంచి పేదలకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం ఫుడ్ కూపన్లు, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి అవకాశాలు అన్వేషించాలి. ఆహార ధరలను మినహాయించి ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవడం మంచిది. తయారీ రంగంలో ద్రవ్యోల్బణం 2023-24 సంవత్సరంలో నాలుగు సంవత్సరాల కనిష్ఠ స్థాయికి తగ్గింది. మెరుగైన నిల్వల నిర్వహణ, ఓపెన్ మార్కెట్ కార్యకలాపాలు, నిత్యావసర వస్తువులపై సబ్సిడీ, వాణిజ్య విధాన చర్యల ద్వారా ఆహార ద్రవ్యోల్బణాన్ని చాలా వరకు అదుపులో ఉంచగలిగారు.

భారత వృద్ధిలో మార్కెట్ల పాత్ర కీలకం

భారత వృద్ధి గాధలో పెట్టుబడి మార్కెట్ల పాత్ర కీలకంగా ఉంది. భారత మార్కెట్ అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలను తట్టుకుంటూ పురోగమిస్తున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో అత్యుత్తమ పనితీరు ప్రదర్శించిన మార్కెట్‌గా భారత మార్కెట్ ఉంది. బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఇన్వెస్టర్లకు అద్భుతమైన రాబడులు అందించాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ 26.8 శాతం, సెన్సెక్స్ 25 శాతం వృద్ధిని నమోదు చేశాయి. భారత మార్కెట్‌ను ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యంగా ప్రపంచ ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. పబ్లిక్ ఇష్యూల జారీ కార్యకలాపాలు కూడా నిలకడగా సాగుతూ ఉండడంతో మార్కెట్ విలువపరంగా భారత మార్కెట్ ప్రపంచంలోనే ఐదో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మే నెలలో ఈక్విటీ మార్కెట్ విలువ 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.415 లక్షల కోట్లు) మైలురాయిని తాకింది. గత ఐదు సంవత్సరాల కాలంలో భారత జీడీపీలో మార్కెట్ విలువ వాటా 124 శాతానికి పెరిగింది. ప్రస్తుతం మార్కెట్లో 9.5 కోట్ల మంది రిటైల్ ఇన్వెస్టర్లున్నారు. వారంతా కలిసి 2,500 లిస్టెడ్ కంపెనీల్లో 10 శాతం ప్రత్యక్ష వాటా కలిగి ఉన్నారు. దేశీయంగా ఆర్థిక స్థితి మెరుగ్గా ఉండడం, సానుకూల పెట్టుబడి వాతావరణం నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల సమీకరణ రూ.10.9 లక్షల కోట్ల స్థాయిలో ఉంది.

అమ్మకాల వెల్లువ

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల బాటలోనే సాగాయి. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించటంతో సోమవారం మార్కెట్లు ఆరంభం నుంచి పతనబాటలోనే సాగాయి. ఇండెక్స్ హెవీ వెయిట్ షేరు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లతో పాటు కోటక్ మహీంద్రా షేర్లలో భారీగా అమ్మకాలకు దిగటంతో బెంచ్ మార్క్ సూచీ సూచీ 102.57 పాయింట్ల నష్టంతో 80,502.08 పాయింట్ల వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో ఒక దశలో సెన్సెక్స్ 504 పాయింట్ల నష్టంతో 80,100.65 పాయింట్ల స్థాయిని తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 21.65 పాయింట్ల నష్టంతో 24,509.25 పాయింట్ల వద్ద ముగిసింది.



ఆహార ధరలపై వాతావరణ ప్రభావం

గత రెండేళ్లుగా ఆహార ధరలపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గి పంటల నష్టం పెరిగింది. ప్రధానంగా కూరగాయలు, పప్పు దినుసుల ఉత్పత్తి తగ్గింది. ఫలితంగా 2022 ఆర్థిక సంవత్సరంలో 3.8 శాతం ఉన్న ఆహార ద్రవ్యోల్బణం 2023 ఆర్థిక సంవత్సరం నాటికి 7.5 శాతానికి పెరిగింది. ప్రధానంగా వాతావరణ మార్పుల వల్ల వేడి గాలులు, రుతుపవన అస్థిరతలు, తుపానులు పెరిగాయి. వీటికి తోడు క్రిమికీటకాలు, పంటలను ఆశించే వ్యాధుల కారణంగా టమాటా, ఉల్లి పంటలు దెబ్బ తిని వాటి ధరలు పెరిగాయి. ఒక పక్క అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తూ మరో పక్క వాతావరణ మార్పుల లక్ష్యాలకు కట్టుబడడం ఒక గారడీ వంటిదే. భారతదేశం ప్రకటించిన నెట్ జీరో లక్ష్యాలు సాధించడంలో శిలాజేతర ఇంధనాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎస్‌డీసీ లక్ష్యాలు సాధించాలంటే 2030 నాటికి 2.5 లక్షల కోట్ల ఆర్థిక వనరులు అవసరం.


ఆరంచెల వ్యూహం

భారత్ గత దశాబ్ది కాలంలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ మెరుగైన వృద్ధిరేటును సాధిస్తూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కారణంగా అల్పాదాయ దేశం స్థాయి నుంచి అల్ప మధ్యాదాయ దేశంగా ఎదిగింది. ఇప్పుడు మధ్యాదాయ, ఎగువ మధ్యాదాయ దేశంగా మారే క్రమంలో ప్రజల ఆకాంక్షలు విశేషంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యకాలిక దృక్పథంలో మనం ఆరంచెల వ్యూహం అనుసరించడం మంచిది.

ఆ వ్యూహంలో ముఖ్యాంశాలు...

- ప్రైవేట్ రంగ పెట్టుబడులు నిలకడగా పెరగాలి. దీని వల్ల ఉద్యోగాల్లో వృద్ధి ఏర్పడడంతో పాటు కార్మికులకు ఆదాయంలో న్యాయబద్ధమైన వాటా దక్కుతుంది.
- హరిత ఆర్థిక వ్యవస్థగా పరివర్తన చెందే క్రమంలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలు కీలకం కానున్నాయి. ఈ ప్రయాణానికి మద్దతు ఇచ్చేందుకు నవ్య దృక్పథంతో కూడిన ఆర్థిక సాధనాలు అందుబాటులోకి రావాలి. వీటి వల్ల ప్రైవేటు పెట్టుబడుల సమీకరణ తేలికవుతుంది.
- ఎంఎస్ఎంఈలకు రుణ లభ్యతలో వ్యత్యాసాల తొలగింపునకు ప్రభుత్వం మార్గాలు అన్వేషించాలి. నియంత్రణల సడలింపు; భౌతిక, డిజిటల్ కనెక్టివిటీ పెంపు, ఎంఎస్ఎంఈలు తమ మార్కెట్ పరిధిని విస్తరించుకోవడానికి వీలుగా మెరుగైన ఎగుమతి వ్యూహం ప్రతిపాదించడం అవసరం.
- భారత వృద్ధికి చోదక శక్తి కాగల సామర్థ్యం వ్యవసాయ రంగానికి ఉంది. ఈ నేపథ్యంలో పర్యావరణ, వాతావరణ పరంగా రైతులకు సహాయకారి అయ్యే విధానాలు రూపొందించాలి.
- జనాభాలో నైపుణ్యాల వ్యత్యాసాన్ని పూడ్చేందుకు అనువైన విద్య, నైపుణ్య విధానాలు అనుసరించాలి. ఇందుకు ఈయూ తరహాలో సమీకృత విధానం వంటిది అనుసరించడం మంచిది.
- ఈ పై అంశాలన్నీ ఫలవంతం కావాలంటే ప్రభుత్వ సామర్థ్యాలు, సమర్థతలు పెరగాలి. ప్రభుత్వ యంత్రాంగాన్ని పునరుజ్జీవింపచేయడంపై ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు 8600 క్యూసెక్కుల వరదనీరు


ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, జూలై 22: ప్రకాశం బ్యారేజి దిగువకు వరదనీటి విడుదల సోమవారం కూడా కొనసాగుతోంది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కట్టలేరు, కీసర తదితర వాగుల నుండి 12వేల 300క్యూసెక్కుల వరదనీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా 12 గేట్లను అడుగుమేర ఎత్తి 8వేల 600క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 1300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు జేఈ తెలిపారు.

జగన్‌రెడ్డి.. నీకు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కుందా?

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 22: జగన్‌మోహన్‌రెడ్డి.. నీకు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు ఉందా? అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వ్యక్తులలో ఏవరైనా ఉన్నారంటే మొదటి వరుసలో జగన్‌రెడ్డి ఉంటారన్నారు. అసెంబ్లీలో నీ బూతుల మంత్రులతో గౌరవసభను కౌరవసభగా మార్చి, సభ్య సమాజం తలదించుకునేలా అసెంబ్లీని మార్చిన నువ్వు రాజ్యాంగం, విలువల గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుందన్నారు. సభా సాంప్రదాయాలు తెలియని నువ్వు, సభలో ఎలా ప్రవర్తించాలో ముందు నేర్చుకుని తరువాత ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే బాగుంటుందన్నారు. నిన్నటివరకు పోలీసు వ్యవస్థను చెప్పు చేతులలో పెట్టుకొని నాటి ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై ఇష్టానుసారం కేసులు పెట్టి జైలుకు పంపించిన నువ్వు నేడు అదే పోలీసులకి నీతులు చెప్పడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒక ఐఏఎస్ అధికారిని మోకాలుపై కూర్చోబెట్టిన నువ్వు నేడు పోలీసులకు మూడు సింహాల గురించి చెప్తుంటే సభ్య సమాజం సిగ్గుతో తలదించుకుంటుందన్నారు. అసెంబ్లీని బాయ్‌కాట్ చేయడానికి వినుకొండ విషయాన్ని తెరపైకి తెచ్చి ఢిల్లీలో ధర్నా చేస్తామంటున్నావని, చంద్రయ్య పీక కోసిన రోజు, డాక్టర్ సుధాకర్‌ని పిచ్చివాడిగా ముద్రవేసి నడిరోడ్డుపై బట్టలిప్పిన రోజు, సుబ్రహ్మణ్యం అనే డ్రైవర్ శవాన్ని మీ ఎమ్మెల్సీ డోర్‌డెలివరీ చేసిన రోజు, అమర్నాథ్‌గౌడ్ అనే విద్యార్థిని పెట్రోల్ పోసి తగలబెట్టిన రోజు ప్రజాస్వామ్య విలువలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు.

ఎన్‌డీబీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యేనా!

- రూ.35.96 కోట్ల నిధులు బూడిదలో పోసిన పన్నీరే
- రెండేళ్ల అగ్రిమెంట్ సమయం ముగిసినా పూర్తికాని పనులు


ఎన్‌డీబీ నిధులు మంజూరైనా నిర్మాణం జరగని తెనాలి - సిరిపురం రోడ్డు

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) నిధులతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో చేపట్టిన పలు రోడ్ల నిర్మాణపనులు పూర్తిచేస్తారో, చేయరో తెలియని పరిస్థితి కొనసాగుతున్నది. పనులు దక్కించుకొన్న నిర్మాణసంస్థ అగ్రిమెంట్ సమయం అయిపోయినా పూర్తి చేయలేకపోయింది. ఇందుకు బిల్లుల చెల్లింపు జరగని పరిస్థితిని సాకుగా చూపిస్తున్నది. ఎన్‌డీబీ కింద ఆయా రోడ్లు మార్కింగ్ అయి ఉండటంతో కనీసం ప్యాచ్‌వర్కులు కూడా ఆర్‌అండ్‌బీ శాఖ చేయలేని పరిస్థితి నెలకొన్నది. వర్షం కురిస్తే కనీసం ఆ రోడ్లలో వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొంది. రోడ్డుపై ఏర్పడిన గుంతలలో కూరుకుపోయి వాహనదారుల సహనానికి పరీక్ష పెడుతున్నా యి. అరకొరగా చేసిన పనులు నామరూపాలు లేకుండా పోయాయి. 2021 మార్చిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ రోడ్ల పనులు రెండేళ్లలో పూర్తికావాల్సి ఉండగా కనీసం 25శాతం కూడా పూర్తికాలేదు. కొన్ని రోడ్లు సీఆర్‌డీఏ పరిధిలోకి వస్తాయని చెప్పి వాటిని చేపట్టనేలేదు. అరకొరగా జరిగిన పనులకు ఏకంగా రూ.35.96 కోట్లకు బిల్లులు పెట్టారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టు ఏజెన్సీ దాదాపుగా పనులను చాప చుట్టేసింది.

ఎన్‌డీబీ నిధుల కింద జిల్లాకు మొత్తం 13 రోడ్లు మంజూరయ్యాయి. వాటిల్లో తాడికొండ-రాయపూడి, తుళ్లూరు-అమరావతి, మంగళగిరి-తాడికొండ వయా నీరుకొండ, రేవేంద్రపాడు - సీతానగరం రోడ్డు, చేబ్రోలు నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు వయా ముట్లూరు, వట్టిచెరుకూరు రోడ్డు, ఓఎం రోడ్డు నుంచి వల్లూరు వయా జీజీ పాలెం - రావిపాడు, వంగిపురం, ఉన్నవ నుంచి జీసీ రోడ్డు వరకు, గనికపూడి-ఉన్నవరోడ్డు, ప్రత్తిపాడు-యడ్లపాడు, పొన్నూరు-పాండ్రపాడు, నిడుబ్రోలు-చందోలు, తెనాలి-సిరిపురం, చిలకలూరిపేట-కోటప్పకొండ రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్ల పొడవు 95.147 కిలోమీటర్లు కాగా రూ. 227.29 కోట్లకు పరిపాలన అనుమతులు వచ్చాయి. కాగా రూ.194.16 కోట్లతో అంచనాలు రూపొందించి టెండర్లు నిర్వహించగా హైదరాబాద్‌కు చెందిన ఒక నిర్మాణ సంస్థకు కట్టబెట్టారు. రూ.121.46 కోట్లుగా అగ్రిమెంట్ విలువని నిర్ణయించారు. గత ఏడాది మార్చి 22వ తేదీకే పనులు పూర్తికావాల్సి ఉన్నది.

కాగా సీఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్‌లో ఉన్నాయని చెప్పి తాడికొండ-రాయపూడి, తుళ్లూరు-అమరావతి రోడ్ల పనులను చేపట్టలేదు. మంగళగిరి-తాడికొండ రోడ్డులోనూ 5నుంచి 11వ కిలోమీటర్ వరకు సీఆర్‌డీఏలో ఉందని ఆ పనిని కూడా చేపట్టకుండా అసంపూర్తిగా వదిలేశారు. రేవేంద్రపాడు-సీతానగరం రోడ్డుని పూర్తిచేసినట్లు ప్రభుత్వానికి నివేదించారు. మిగతా పనులన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటివరకు రూ.35.96కోట్ల విలువ కాగల పనులు పూర్తిచేసినట్లు బిల్లులు పెట్టారు. వాటిల్లో రూ.20.9 కోట్లు డ్రా అయ్యాయి. మరో రూ.12.88కోట్లు సీఎఫ్ఎంఎస్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. మరో రూ.2.22కోట్లకు బిల్లులు సిద్ధం చేశారు. కాగా ఎన్‌డీబీ నిధులను గత వైసీపీ ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్‌కి దారిమళ్లించి వేరే అవసరాలకు వినియోగించేసిందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ కారణంగానే కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో పనులు నిలిపేసినట్లు సమాచారం. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణ జరిపి పనులు పూర్తిచేసేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రూ.60 లక్షలకు పోస్టల్ ఉద్యోగి కుచ్చుటోపి

- డబ్బులిప్పించి ఆదుకోవాలి : సిరిపూడి పోస్టాఫీస్‌లో బాధితుల ఆందోళన


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిరిపూడి పోస్ట్ ఆఫీస్ బాధితులు

బాపట్ల, జూలై 22: నగరం మండలం సిరిపూడి పోస్టాఫీస్ పరిధిలో రూ.60లక్షల వరకు పొదుపు చేసి మోసపోయామని 70మంది బాధిత మహిళలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. మోసపోయిన తీరును కలెక్టర్‌కు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. బాధితుల కథనం మేరకు.. తాము చెల్లించిన డబ్బులు పోస్టల్ ఖాతాలో సంబంధిత పోస్టల్ ఉద్యోగి జమచేయలేదని ఆరోపించారు. పోస్టల్ ఉద్యోగి బడుగు గోపి మనోజ్‌వర్మపై చర్యలు తీసుకొని డబ్బులు మొత్తం తిరిగి ఇప్పించాలని కోరారు. గ్రామీణప్రాంతమైన సిరిపూడిలో గత 30 సంవత్సరాలుగా పోస్టాఫీస్ నడుస్తున్నదని, పేదప్రజలు, వ్యవసాయకూలీలు, చేతివృత్తిదారులు పోస్టాఫీస్‌లో నెలకు రూ.1000 చొప్పున పొదుపు చేసుకున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సి.హెచ్.మణిలాల్ తెలిపారు. లక్ష నుండి రూ.4లక్షల వరకు డిపాజిట్‌లు కూడా చేశారన్నారు. గత 10 సంవత్సరాలుగా పొదుపు చేసుకుంటే పోస్టాఫీస్ ఉద్యోగిగా గోపిమనోజ్‌వర్మ వచ్చినప్పటి నుండి ఖాతాదారుల పాస్‌పుస్తకాలలో డబ్బులు జమ అయినట్లు రాసిస్తూ హెడ్‌పోస్టాఫీస్‌లో జమచేయటంలేదన్నారు. ఆన్‌లైన్ చేయకుండా మోసం చేశారన్నారు. నెలరోజుల క్రితం డిపాజిట్ డబ్బులు విత్‌డ్రా కోసం ఒక ఖాతాదారుడు పోస్టల్ ఉద్యోగిని అడగగా ఆన్‌లైన్ కాలేదు, టెక్నికల్ సమస్య, సర్వర్ పనిచేయటంలేదంటూ వారం రోజులు తిప్పుకోవటంతో సదరు ఖాతాదారులు పిట్టలవానిపాలెం పోస్టాఫీస్ వద్ద చెక్ చేయించుకుంటే డబ్బులు జమకాలేదని తెలిసిందన్నారు. దీంతో ఖాతాదారులంతా చెక్ చేసుకుంటే మోసపోయినట్లు తెలిసిందన్నారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. లేకుంటే బాధితులతో పోరాటకమిటి ఏర్పాటుచేసి ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొప్పుల గోపి, బాధితులు మల్లేశ్వరి, అంజలి, దివ్య, గోపి, సాల్మన్‌రాజు, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఏఎన్‌యూ రెక్టార్‌గా ప్రొఫెసర్ రత్న షీలామణి

- రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ సింహాచలం
- దూరవిద్య డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు
- వర్సిటీలో పలు పాలనా పదవులు భర్తీచేసిన వీసీ గంగాధర్‌రావు


పదవులు పొందిన అధికారులతో వర్సిటీ వీసీ ఆచార్య గంగాధర్‌రావు

పెదకాకాని, జులై 22: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పాలనాపరమైన పదవులను ఇన్‌ఛార్జి వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కే గంగాధర్ రావు సోమవారం భర్తీ చేశారు. ఈ పదవులన్నీ తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఉంటాయని పేర్కొన్నారు. వీటిల్లో రెక్టార్‌గా ప్రొఫెసర్ కే రత్నషీలామణి, రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు, ఐక్యుఏసీ కోఆర్డినేటర్‌గా డాక్టర్ కృష్ణసత్య, పీజీ పరీక్షల కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎం.సుబ్బారావు, దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ డి.రామచంద్రన్, రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ సుధాకర్, సీడీసీ డీన్‌గా ప్రొఫెసర్ వీ రవికుమార్, బాబు జగ్జీవన్‌రామ్ చైర్ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ రత్నాకర్, యూజీసీ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎం త్రిమూర్తిరావు, దూరవిద్య కేంద్రం స్టడీ సెంటర్ల కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ లింగరాజులు నియమితులయ్యారు.

లంక గ్రామాలకు పడవల ద్వారా ప్రయాణం


కొల్లిపర కృష్ణానది రేవులో లంక గ్రామాల నుంచి పడవల ద్వారా వస్తున్న రైతులు

కొల్లిపర, జూలై 22: ప్రకాశం బ్యారేజి నుండి కృష్ణానది దిగువకు నీటిని విడుదల చేయడంతో మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర, బొమ్మువానిపాలెం, అన్నవరం లంక రేవుల్లోకి నీరుచేరింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. రైతులు కృష్ణానదిలో నిర్మించుకున్న గాలుమార్గాలు పూర్తిగా మునిగిపోయాయి. దీంతో పడవల ద్వారా లంక గ్రామాలకు వెళ్ళవలసిన పరిస్థితి నెలకొంది. మండల యంత్రాంగం, ఆర్‌సీ అధికారులు అప్రమత్తమయ్యారు. రేవుల్లోకి ఎవరూ వెళ్ళవద్దని హెచ్చరికలు జారీ చేశారు. పడవ నడిపే జాలర్లు తగు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు.

వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయిన గాలుమార్గం


గాజుల్లంక వద్ద వరదనీటి ఉధృతికి కొట్టుకుపోయిన శ్రీకాకుళం గాలుమార్గం

కొల్లూరు, జూలై 22: కృష్ణానదిలో శ్రీకాకుళం వైపు వేసిన గాలుమార్గం వరదనీటి ఉధృతికి కొట్టుకుపోయింది. సోమవారం ఉదయం ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేసిన వరదనీరు మండల పరిధిలోని గాజుల్లంక వద్ద కృష్ణానదిలో చేరింది. గాజుల్లంక నుంచి శ్రీకాకుళంకు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన గాలుమార్గం వరదఉధృతికి కొట్టుకుపోయింది. నదిలో పడవలు తిరిగేందుకు కూడా పూర్తిస్థాయిలో వరదనీరు లేకపోవడంతో శ్రీకాకుళం వెళ్లాలంటే మండల ప్రజలకు 40కి.మీ. దూరం పెరిగింది. పెనుమూడి మీదుగా పులిగడ్డ వెళ్లి అక్కడ నుంచి శ్రీకాకుళం వెళ్లాల్సి ఉంది.

శాసనమండలి ప్రతిపక్ష నేతగా లేళ్ళ అప్పిరెడ్డి



గుంటూరు, జూలై 22: ఎమ్మెల్సీ మాజీ విప్, వైసీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జ్ లేళ్ళ అప్పిరెడ్డి మండలిలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ అధినేత జగన్ నిర్ణయం తీసుకొన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ కేవలం 11 సీట్లకే పరిమితం కావటంతో శాసనసభలో ప్రతిపక్ష హోదా కూడా లేకుండాపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శాసనమండలిలో వైసీపీకి సంఖ్యాబలం ఉండటంతో అధినేత జగన్ మండలిలో ప్రతిపక్షనేతగా అప్పిరెడ్డికి అవకాశం కల్పించారు. ఇకపై కేబినెట్ హోదాలో మండలిలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించనున్నారు. గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెంనకు చెందిన అప్పిరెడ్డి విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ప్రవేశించారు. తొలుత దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2006లో వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు) చైర్మన్‌గా లేళ్ళ అప్పిరెడ్డి నియామకానికి జగన్ సిఫార్సు చేశారు. అనంతర పరిణామాల నేపథ్యంలో వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. 2020లో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చాక 2021లో ఆయనకు ఎమ్మెల్సీ కట్టబెట్టారు. 2023లో శాసనమండలి విప్‌గా కూడా వ్యవహరించారు. తాజాగా ఆయన శాసనమండలి ప్రతిపక్ష నేతగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున, పలువురు పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మిర్చిలోడు లారీ డ్రైవర్ కిడ్నాప్, హత్య

- పోలీసుల అదుపులో నిందితులు
- డ్రైవర్‌ను హత్య చేసి భద్రాచలం వద్ద గోదావరిలో వేశామని వెల్లడి..?


ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన హతుడి భార్య, కుటుంబ సభ్యులు

గుంటూరు, జూలై 22: నగరానికి చెందిన లారీ డ్రైవర్‌ను కిడ్నాప్ చేసి హత్యచేసి మృతదేహాన్ని భద్రాచలం వద్ద గోదావరిలో వేసిన ఘటన కలకలం రేపుతోంది. నగరంలోని నల్లచెరువు సుగాలికాలనీకి చెందిన రామావత్ వలియానాయక్ లారీడ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 18న మధ్యాహ్నం ఇంటినుంచి మిర్చిలోడు లారీకి వెళ్ళాడు. అదేరోజు సాయంత్రం మిర్చియార్డ్ వద్ద మిర్చిలోడ్ చేసుకొని పాట్నా బయలుదేరాడు. రాత్రి 9గంటలకు ఏలూరు దాటినట్లు ఫోన్లో చెప్పాడు. ఆ తర్వాత నుంచి తన భర్త నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు వచ్చిందని ఆయన భార్య బిచాని తెలిపారు. తర్వాత రోజు ఉదయం 7.30 సమయంలో ఫోన్ చేయగా అప్పుడు కూడా ఫోన్ స్విచ్ ఆఫ్ అని రావడంతో లారీ యజమాని సాజిద్‌కు ఫోన్‌చేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వద్ద లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసిందని, తాము అక్కడికి వెళ్లి విచారించిన తర్వాత అన్ని విషయాలు చెబుతానని చెప్పాడన్నారు. ఆ తర్వాత యజమానికి ఎన్నిసార్లు ఫోన్‌చేసినా ఆయన నుంచి సమాచారం రాలేదన్నారు. దీంతో 19న నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారన్నారు. ఆ తరువాత పోలీసులను సంప్రదించగా వారు ఈ కేసు భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో విచారిస్తున్నట్లు చెప్పారన్నారు. దీంతో తమ బంధువులు భీమడోలు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళగా తన భర్తను కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేసి చంపి భద్రాచలం ప్రాజెక్టులో మృతదేహాన్ని పడేసి లారీని అపహరించుకుని వెళ్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు చెప్పారన్నారు. అయితే లారీలో తన భర్తతోపాటు ఉన్న క్లీనర్ ఏమయ్యాడో కూడా తెలియడం లేదన్నారు. ఓసారి ఆయనను కూడా చంపామని చెప్పారని, మరోసారి ఆయనను కొట్టి వదిలేసామని అంటున్నారని బాధితురాలు వాపోయారు. నిందితులు తన భర్తను చంపితే పోలీస్ అధికారులు వెంటనే స్పందించి తన భర్త మృతదేహాన్ని గుర్తించాలని ఆమె కోరారు. లారీ డ్రైవర్‌ను హత్య చేసి లారీని అపహరించుకు వెళుతుండగా పోలీసులు లారీతో సహా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నగరంలోని స్వర్ణభారతినగర్‌కు చెందిన పల్లపు హరికృష్ణ, ప్రకాశం జిల్లా పోతవరానికి చెందిన గుంటూరు నూతన్‌కుమార్, కృష్ణాజిల్లా గన్నవరానికి చెందిన బల్ల తేజ్‌కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకి చెందిన కె మణికంఠలను భీమడోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను భీమడోలు పోలీసులు విచారించగా తాము లారీ డ్రైవర్ను హత్య చేసి మృతదేహాన్ని భద్రాచలం ప్రాజెక్టులో పడేసినట్లు చెప్పారన్నారు. ఇదిలాఉంటే లారీలోని మిర్చి ఖరీదు సుమారు రూ.13లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. తాము స్వాధీనం చేసుకున్న మిర్చిలోడును సంబంధిత యజమానికి అప్పగిస్తామని పోలీసులు వెల్లడించారు.

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు

- అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించే అవకాశం

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన మద్దతుతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వ ఎన్‌డీఏ ప్రభుత్వం మంగళవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో రాష్ట్రానికి ముఖ్యంగా అమరావతి రాజధాని, ఉమ్మడి గుంటూరు జిల్లాలో నిర్మాణదశలో ఉన్న రైల్వేప్రాజెక్టులు, గతంలో మంజూరై ఇంకా అడుగు ముందుకుపడని రైలుమార్గాలు, రహదారులకు నిధుల కేటాయింపుపై అందరూ ఆశలు పెట్టుకొన్నారు. ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఏమేరకు నిధులు కేటాయించారనేది మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.

ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల అనంతరం పూర్తిస్థాయి బడ్జెట్ మంగళవారం పార్లమెంట్ ముందుకురానుంది. ఎన్‌డీఏ-1లో టీడీపీ భాగస్వామ్యమై అమరావతి రాజధానికి నిధులు రాబట్టింది. అలానే గుంటూరు నగరానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అమరావతి స్మార్ట్‌సిటీకి నిధుల కేటాయింపు జరిగాయి. మంగళగిరి ఎయిమ్స్ కూడా అప్పుడే నిర్మాణం ప్రారంభమై అనతికాలంలోనే పూర్తైంది. అలానే ఆంధ్రప్రదేశ్ విభజనచట్టంలో కేంద్రసంస్థలు కూడా కొన్నింటిని గుంటూరు జిల్లాలోనే ఏర్పాటుచేసేందుకు నిర్ణయం జరిగింది. ప్రత్యేకహోదా బదులు స్పెషల్‌ప్యాకేజ్ కూడా లభించింది. అయితే అప్పట్లో ప్రతిపక్షంలోని వైసీపీ రెచ్చగొట్టి కూటమి సఖ్యతని దెబ్బతీసింది.

2019-24 మధ్యన గుంటూరు జిల్లాకు కేంద్రం నుంచి వచ్చిన నిధులు నామమాత్రమే. నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టులకు మాత్రమే నిధుల కేటాయించారు. అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే అడుగు ముందుకు పడలేదు. రాజధాని నిర్మాణాన్ని నిలిపేసి మూడు ముక్కలాటకు తెరతీయడంతో కేంద్రం కూడా ఎలాంటి నిధులను ఇవ్వలేదు. అమరావతి రాజధానికి నూతన రైలుమార్గానికి కూడా నిధులు కోరకపోవడంతో దానిని కూడా కేంద్రం అటకెక్కించింది. అయితే ఈ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడటంతో వైసీపీపై తిరుగులేని విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో నిధుల కేటాయింపులో కచ్చితంగా తగిన ప్రాధాన్యం ఉంటుంద న్న అంచనాలు పెరిగిపోయాయి. ఎర్రుబాలెం-నంబూరు అమరావతి నూతన రైలుమార్గానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉన్నది. అలానే అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు, చినకాకాని-పొట్టిపాడు విజయవాడ ఈస్టర్న్ బైపాసు, అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేకి నిధులు కేటాయించొచ్చని అంచనా వేస్తున్నారు. అలానే గుంటూరు - బీబీనగర్ రైల్వేడబ్లింగ్ కూడా నిధులు కేటాయించే అవకాశం ఉన్నది.

రూ.10.48లక్షల పురుగుమందుల అమ్మకాలు నిలిపివేత


ఏటుకూరు రోడ్డులో ఉన్న పురుగుమందుల గిడ్డంగులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గుంటూరు సిటీ, జూలై 22: గుంటూరు నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న పురుగుమందుల గిడ్డంగులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె. ఈశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ దాడుల్లో వ్యవసాయశాఖ అనుమతులు లేకుండా పురుగుమందులను అమ్ముతున్నట్లు గుర్తించారు. శ్రీపారిజాత ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్‌లో నిల్వ ఉంచిన రెండు రకాల పురుగుమందులు, గుళికల బస్తాలపై ముద్రించిన వివరాలు సరిగా లేనందున అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశారు. రూ.10.48 లక్షల విలువ చేసే 38.195 మెట్రిక్ టన్నుల గుళికల అమ్మకాలు నిలిపివేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయ అధికారి ఖడ్గం రమణకుమార్, స్థానిక వ్యవసాయ అధికారి గౌతమ్ ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు


నిందితులతో సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి, ఎస్ఐ సుమన్, సిబ్బంది

నరసరావుపేట లీగల్, జూలై 22: మోటర్‌సైకిళ్ల చోరీకేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితుల నుంచి సుమారు రూ.9లక్షల విలువైన 16 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై నరసరావుపేట, గుంటూరులలో 16 చోరీకేసులు నమోదయ్యాయన్నారు. నరసరావుపేట సబ్ డివిజన్‌లో 11, గుంటూరులో 5 మోటారు సైకిల్‌ను చోరి చేసినట్లు తెలిపారు. నిందితులైన మండలంలోని యలమందకు చెందిన తమ్మిశెట్టి శివ నాగరాజు, సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన ఎం.రవి, ఒంగోలుకు చెందిన షేక్ కృపారావులను కోర్టులో ప్రవేశపెడతామన్నారు. వీరు పాత నేరస్తులని, అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమావేశంలో ఎస్ఐ సుమన్, ఏఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

36,561 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 39,466 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 36,561 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 16,540 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000	334	8500	14500
నెంబరు. 5	9000	14500	నెంబరు. 5	9000	12000
273	11000	15000	273	–	–
341	9000	15000	341	8500	16500
4884	–	–	4884	–	–
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	18500	తేజ	9000	18000
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	9000	13000
దేవనూరుడీలక్స్	10000	11000	దేవనూరుడీలక్స్	10000	12000
తెల్లకాయలు	5000	12500	తెల్లకాయలు	5700	12000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



మండల కేంద్రమైన దుర్గి లోని నాగార్జున శిల్ప కళాశాలను ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు. శిల్పకళ కళాశాల నిర్వాహకుడు చెన్నుపాటి శ్రీనివాసాచారి ఈ సందర్భంగా ఎస్పీకి వేంకటేశ్వర స్వామి శిల్పాన్ని జ్ఞాపికగా అందించారు. - **దుర్గి**



మంచినీటి చెరువును పరిశీలిస్తున్న కమిషనర్

మంచి నీటి చెరువులకు సాగర్ జలాలు

సత్తెనపల్లి, జూలై 22 : మంచినీటి చెరువులకు సాగర్ జలాలు విడుదలవుతున్న నేపథ్యంలో స్థానిక గార్లపాడు రోడ్డులోవున్న రక్షిత మంచి నీటి పథకం చెరువును సోమవారం మునిసిపల్ కమిషనర్ షమ్మి ఇతర అధికారులతో కలసి సందర్శించారు. రక్షిత మంచి నీటి చెరువుకు సాగర్ జలాలను ఎలా మళ్ళించాలి? తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కమిషనర్ షమ్మి ఇంజనీరింగ్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెరువుకు నీటిని నింపే సందర్భంలో అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈ మధు సూదనరావు, ఏఈ సాగర్ తదితరులు ఉన్నారు.

వినతి పత్రం అందజేత ..

పట్టణంలోని 17వ వార్డు శాలి వాహన నగర్‌లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని కోరుతూ ఆ ప్రాంత ప్రజలు సోమవారం మునిసిపల్ కమిషనర్ షమ్మికి వినతిపత్రం అందించారు. రోడ్లు, కాలువలు లేక పోవటంతో వర్షా కాలంలో రహదారులపై నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నరసింహారావు, హనిమిరెడ్డి, సురేష్, పాపారావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి ప్రయాణీకుల ఆదరణే ముఖ్యం

● పల్నాడు జిల్లా ఆర్ఎం ఎన్వీ శ్రీనివాసరావు

పిడుగురాళ్ళ, జూలై 22: పల్నాడు జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో ఆర్టీసీ ఆదాయం అంతంత మాత్రంగానే వుందని పల్నాడు జిల్లా ఆర్ఎం ఎన్వీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల ఆర్టీసీ డిపోలో కార్గోపార్శిల్ సర్వీస్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రయాణీకులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రయాణీకుల ఆదరణే ఆర్టీసీ ముఖ్యమన్నారు. మాచర్ల నుంచి కారంపూడి మీదుగా బెంగుళూరుకు ఒక సర్వీస్, వినుకొండ నుంచి తిరుపతి మీదుగా ఒక సర్వీసు నడుస్తుందని శ్రీనివాసరావు తెలిపారు. కార్గో సర్వీసుతో తక్కువ చార్జీతో త్వరితగతిన, సురక్షితంగా పార్శిల్‌ను గమ్య స్థానాలకు చేర్చేందుకు వీలు పడుతుందన్నారు. పల్నాడు జిల్లా పరిధిలో ఆర్‌టిసి డిపోలో డ్రైవర్ల కొరత వున్నచోట ఔట్‌సోర్సింగ్ విధానంలో డ్రైవర్లను తీసుకున్నామని, పిడుగురాళ్లలో ప్రస్తుతానికి సిబ్బంది కొరత లేదన్నారు. కార్యక్రమంలో కార్గో సర్వీస్ కమర్షియల్ ఏటీఎం ఐ.సురేష్‌కుమార్, డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు, కార్గో పార్శిల్ కాంట్రాక్టర్ శ్రీధర్, ఎస్‌టిఐ ఐవీఎంఎం రావు, ప్రసన్న, నరసింహారావు, మల్లిఖార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ అప్‌డేషన్


నకరికల్లు, జూలై 22: ప్రభుత్వం సచివాలయాల్లో ఆధార్ అప్‌డేషన్‌పై ప్రత్యేకడ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో డీ.జయమణి సోమవారం తెలిపారు. మంగళవారం నుంచి 27వ తేదీ శనివారం వరకు ఈ డ్రైవ్ కొనసాగుతుందని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆమె సూచించారు.

ఆధార్ క్యాంపుల వివరాలు ఇలా..

23 చేజర్ల హైస్కూల్‌లో, గుండ్లపల్లి -2 సచివాలయంలో, 24న చేజర్ల హైస్కూల్‌లో, గుండ్లపల్లి - 2 సచివాలయంలో, 25న కుంకలగుంట - 1 సచివాలయంలో, నరసింగపాడు సచివాలయంలో, 26న కుంకలగుంట సచివాలయంలో, నరసింగపాడు సచివాలయంలో, 27న కుంకలగుంట - 2 సచివాలయంలో, నరసింగపాడు సచివాలయంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జయమణి తెలిపారు. ప్రకటిం చిన షెడ్యూల్‌కు అనుగుణంగా ప్రజలు ఆధార్ సేవలను వినియోగించు కోవాలని ఎంపీడీవో డీ.జయమణి కోరారు.

అమరావతి: మండల పరిధి గ్రామాలలో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాణీ తెలిపారు. 23న నెమలికల్లు, మల్లాది, పెదమద్దూరు, 24న కర్లపూడి, జూపూడి, లింగాపురం, 25న ఎండ్రాయి, మునగోడు, అమరావతి-1, 26న ధరణికోట, అత్తలూరు, అమరావతి-2, 27న ధరణికోట, దిడుగు, నరుకుళ్లపాడు గ్రామాలలోని సచివాలయాలలో క్యాంప్‌లు జరుగుతాయని తెలిపారు.

దాచేపల్లి: సచివాలయాల్లో ఆధార్ అప్‌డేషన్ కార్యక్రమం చేపడుతున్నట్లు దాచేపల్లి ఎంపీడీవో వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు సచివాలయాల్లోనే ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతుందని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఒక్క రూపాయి ఫీజు చెల్లించాల్సిన అవసరంలేదని, ఉచితంగా ఈసేవలు పొందవచ్చని వెంకటరమణ తెలిపారు



నిండు కుండలా చెరువు .. నారు మళ్ళ దుక్కిని సిద్ధం చేస్తున్న ఓర్వకల్లు రైతులు

నిండు కుండలా ఓర్వకల్లు చెరువు

● వరి సాగుకి నారు మళ్ళు సిద్ధం చేస్తున్న రైతులు

అచ్చంపేట, జూలై 22 : మండలంలోని ఓర్వకల్లు చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు నిండు కుండలా మారింది. ఈ చెరువు కింద సుమారు 200 ఎకరాలకు పైగా వరిసాగు అవుతుంది. చెరువు నిండుగా ఉండటంతో రైతులు వరి సాగుకు సిద్ధ మవుతున్నారు. మాగాణిలో నారు మళ్ళు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. సకాలానికి వర్షం కురవటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం 150 ఎకరాలకు పైగా సాగు చేస్తున్న రైతులు ఈ సంవత్సరం 200 ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

'నాడు-నేడూ' అంతా ఆర్భాటమే !

● నిధులు లేమితో పూర్తికాని పనులు

● గత పాలకుల పాపం.. నేటి విద్యార్థులకు శాపం

● కూటమి ప్రభుత్వంపైనే భారం

పిడుగురాళ్ళ, జూలై 22: గత ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన 'నాడు-నేడు' పథకం ఆరంభ శూరత్వం.. అంతా ఆర్భాటమేనన్న విమర్శలను ఎదుర్కొంటోంది. ఆయా పనులకు అప్పట్లోనే నిధుల గ్రహణం పట్టగా, వాటిని పూర్తిచేయాల్సిన భారం, బాధ్యత ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే పడింది.

గురజాల నియోజకవర్గ పరిధిలో రెండవ విడతలో నాడు-నేడు పథకం కింద సుమారు 40 పాఠశాలలకు అరకొరగానే అప్పటి వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పల్నాడు జిల్లాలో అతి పెద్దది అయిన పిడుగురాళ్ల జడ్పీ పాఠశాలకు అదనపు గదుల నిర్మాణం పేరుతో సుమారు రూ.4 కోట్లు రూపాయలు మంజూరు చేయగా, ఆయా పనులను పూర్తిచేసేందుకు ఆ నిధులు సరిపోలేదు. గదుల నిర్మాణం, తలుపులు, బండలు వేయడం మినహా మిగిలిన పనులను ఇంకా పూర్తిచేయాల్సి వుంది. నాడు-నేడు పథకం కింద విద్యార్థులు కూర్చునే బల్లలు, విద్యుత్ సామగ్రితో పాటు మిగిలిన



అసంపూర్తిగా నిర్మించిన జమున స్కూల్ తరగతి గదులు



ఇంకా పూర్తికాని పిడుగురాళ్ల జడ్పీ హైస్కూల్ తరగతి గదులు

మెటీరియల్ అంతా ప్రభుత్వమే సరఫరా చేసింది. ఇంకా పనులు పూర్తి కావాలంటే మరో రూ.25 లక్షలకు పైగా నిధులు వ్యయమయ్యే అవకాశం వుంది. అదేవిధంగా పిడుగురాళ్ల పట్టణంలో జమున స్కూల్, జానపాడు రోడ్డులోని గుంత స్కూల్ (ఎల్ఈ) కూడా నాడు-నేడు పథకం కింద మంజూరైన నిధులు పునాదులు, సగం గోడల నిర్మాణాలకే సరి పోయాయి. మిగిలిన నిధులు సరిపోకపోవడంతో ఆయా పాఠశాలల్లో పనులు అటకెక్కాయి. గుంత స్కూల్‌లో విద్యార్థులు ఇరుకైన గదుల్లోనే ఒదిగి పోతుండగా జమున స్కూల్ మాత్రం ప్రైవేటు వ్యక్తికి చెందిన రేకులషెడ్డులో నడుపుతు న్నారు. అదికూడా దాతల సహాయంతో, చందాలు వేసుకొని అద్దెలు చెల్లించడం అక్కడ ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. అలాగే మరికొన్ని గ్రామాలకు చెందిన పాఠశాలల్లో నాడు-నేడు పథకం పనులు నిధుల కొరతతో గత ప్రభుత్వ హయాంలోనే నిలిచి పోయాయి. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆపనులు పూర్తిచేసేందుకు కోట్లాది రూపాయల వ్యయం ఖర్చు చేయాల్సి వుంది. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన నాడు-నేడు పథకం పనుల్లో గత పాలకులు చేసిన పాపం నేటి విద్యార్థులకు శాపంగా మారింది.

నేటి నుంచి గ్రామ సభలు

గురజాలటౌన్, జూలై 22: మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణానాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు ఈ గ్రామసభలు జరుగుతాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జనలు చేయవద్దని, ప్రతి ఒక్కరూ తమ గృహాల్లో మరుగుదొడ్లు నిర్మించుకునేలా గ్రామసభల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు. అలాగే పండ్ల తోటలు సాగు ఔత్సాహికులకు ఉపాధిహామీ కింద ప్రభుత్వం మొక్కలు అందజేస్తుందని, కావాల్సిన వారు గ్రామసభల్లో అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ

దుర్గి, జూలై 22: మండలంలోని ఓబులేశునిపల్లెలో గల పాల ఉత్పత్తి కేంద్రంలో 239 మంది పాల ఉత్పత్తి దారులకు సోమవారం సంగం డెయిరీ ఆధ్వర్యాన రూ.5,71,702 బోనస్‌లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా సంగం డెయిరీ డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాల ఉత్పత్తి కేంద్రాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఉప్పలపాటి రంగారావు, రూట్ సూపర్‌వైజర్ బద్దులు హనుమంతురావు, ఓబులేశునిపల్లె పాల ఉత్పత్తి కేంద్రం అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేత

కారంపూడి, జూలై 22: మండలంలోని ఒప్పిచర్ల జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు సోమవారం విశ్వహిందూపరిషత్ సభ్యులు 200 భోజనం ప్లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవి కుమార్, హెచ్ఎం విజయలలిత, శెట్టి హనుమంతురావు, భవిరిశెట్టి రామారావు, గుండా ఉమామహేశ్వరరావు, కజ్జం ఆంజనేయులు, గణితి అమరయ్య, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

బెల్లంకొండ, జూలై 22: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షురాలు చెన్నపరెడ్డి పద్మ అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

ప్రభాకరరావు సేవలు మరువలేనివి

పెదకూరపాడు, జూలై 22: విధి నిర్వాహణలో ప్రభాకరరావు అందించిన సేవలు మరువ లేనివని పులిచింతల స్పెషల్ కలెక్టర్ కందుల శ్రీరాములు అన్నారు. పెదకూరపాడు తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న జీవీగుంట ప్రభాకరరావుకు సోమవారం వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయుడు రాయపూడి సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఎంపీడీవో పీ. మల్లేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ నిర్మలకృష్ణలు మాట్లాడుతూ ప్రభాకరరావు విధి నిర్వాహణలో తోటి ఉద్యోగులకు ఆదర్శప్రాయులని అన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ తులసీరామ్, వీఆర్‌వోలు సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు ప్రభాకరరావును సత్కరించారు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

వెల్దుర్తి, జూలై 22: ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని గొట్టిపాళ్ల, కొత్తపుల్లారెడ్డి గ్రామాల్లో సోమవారం ఆయన సిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ గ్రామస్థులతో మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడవద్దని హితవు పలికారు. గ్రామంలో ఎవ్వరూ వ్యక్తిగత, రాజకీయ వేధింపులకు, ఘర్షణలకు పాల్పడవద్దని కోరారు. ఏ చిన్న ఘర్షణ విషయమైనా తమ దృష్టికి వస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు.



పత్తి మొక్కలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి వెంకటనరసయ్య

పొలాల్లో పత్తి మొక్కల పరిశీలన

రాజుపాలెం, జూలై 22: మండలంలోని బలిజేపల్లి గ్రామంలోని పొలాల్లో పత్తి మొక్కలను మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకట నరసయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి పైరులో పచ్చ దోమ ఎక్కువగా ఉన్నట్లు వెంకటనరసయ్య గుర్తించారు. దీని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అదేవిధంగా పొలంలో నిలిచివున్న నీటిని బయటకు పంపించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు తిరుమల, అభ్యుదయ రైతులు, తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

అచ్చంపేట, జూలై 22 : స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పెదనందిపాడు మండలంపాలపర్రు గ్రామానికి చెందిన కట్టా హర్షిత అనే విద్యార్థినికి మామిళ్ళపల్లి విజయలక్ష్మి చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందజేశారు. హర్షిత ఐఐటీ బొంబాయిలో మొదటి సంవత్సరం చదువుతుంది. ఇటీవల జరిగిన జేఈ మెయిన్స్‌లో 50వ ర్యాంకు సాధించింది. హర్షిత ఉన్నత చదువుల నిమిత్తం రూ.40 వేలు విలువైన ల్యాప్‌టాప్‌ను అందజేసినట్లు స్నేహ హస్తాల ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ కరిముల్లా బాబు అన్నారు.

వీరభద్రుని గుడిలో అమ్మవారికి పూజలు

అచ్చంపేట, జూలై 22 : మండల కేంద్రమైన అచ్చంపేటలోని వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం ఆషాడమాసం సందర్భంగా భద్రకాళి అమ్మవారికి గోరింటాకు కలిపి భక్తులు తమ కోర్కెలు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ మహిళా నేత చల్లా అనూపకళ, యడ్లపల్లి కృష్ణ ప్రియ, ఎనిగండ్ల శుభద్ర, తాళ్ళూరి లక్ష్మి, కొండేపి కృష్ణ కుమారి తదితర మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథిగా మామిళ్ళపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

పింఛన్‌ల పై విచారణ

ముప్పాళ్ళ, జూలై 22: మండలంలోని కుందురువారిపాలెంలో గత ప్రభుత్వంలో అనర్హులు పింఛన్‌లు పొందుతున్నారని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బృందం విచారణ చేపట్టింది. గ్రామస్థులు 15 మంది పై ఫిర్యాదు ఇచ్చినట్టు ఎంపీడీవో కృష్ణారావు తెలిపారు. పింఛన్‌లు పొందుతున్న వారి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, వికలాంగ సర్టిఫికెట్లను పరిశీలించామని, ఆ నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని ఎంపీడీవో తెలిపారు. విచారణ బృందంలో ఈవోపీఆర్‌డీ రూపవతి, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ఉన్నారు.

నెమలిపురిలో పోలీస్ కవాతు

రాజుపాలెం, జూలై22: మండలంలోని నెమలిపురి గ్రామంలో సోమవారం సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, సీఐ రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ షామీర్‌బాషా సారథ్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. గ్రామంలో గతంలో రెండు హత్యలు జరుగగా ఆ కేసుల్లో నిందితులుగా ఉన్నవారు అనంతర కాలంలో గ్రామం బయటకు వెళ్లిపోయారన్నారు. ఆదివారం తిరిగి వారు గ్రామంలోకి రావటంతో శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ షామీర్‌బాషా తెలిపారు. గ్రామంలో ఎవరూ ఏ కారణంతోనైనా వివాదాలకు, ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. ఏ సమస్య వచ్చినా తమను సంప్రదించి పరిష్కరించుకోవాలని గ్రామస్థులను కోరారు.

పోలీసుల అదుపులో జూదరులు

నకరికల్లు, జూలై 22 : నకరికల్లు నుంచి ఇనిమెట్ల వెళ్ళే మార్గంలో డంపింగ్ యార్డు వద్ద పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని సోమవారం అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ 4,120 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కే.నాగేంద్రరరావు తెలిపారు. నగదును, జూదరులను కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. మండలంలో ఎక్కడైనా జూదం జరుగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా పోలీసులు స్థానికులకు సూచించారు.

ఎన్టీఆర్ దిమ్మె ధ్వంసం

● పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు

మాచర్లటౌన్, జూలై 22: పట్టణంలోని 24వ వార్డు పోలేరమ్మ ఆలయం వద్దనున్న ఎన్టీఆర్ ప్రతిమ గల టీడీపీ దిమ్మెను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్‌నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావులు ఆ ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. పగిలిపోయిన దిమ్మెకు స్టిక్కర్ అతికించారు. అనంతరం చుట్టూ క్లాత్ కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ దిమ్మెను ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. గతంలో వైసీపీ పాలనలోనూ మాచర్లలో ఆ పార్టీ నేతలు ఎన్టీఆర్ విగ్రహాలు ధ్వంసం ధ్వంసానికి పాల్పడిన విషయాన్ని గుర్తుచేశారు. కక్షపూరిత రాజకీయాలు మా నైజం కాదంటూ సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలకు కట్టుబడి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సంయమనం పాటిస్తున్నారన్నారు. వైసీపీ మాదిరిగా టీడీపీ నేతలు



ధ్వంసమైన జెండా దిమ్మెను పరిశీలిస్తున్న యాగంటి తదితరులు

కూడా కక్షపూరితంగా వ్యవహరిస్తే పరిస్థితి మరోలా ఉంటుందని హెచ్చరించారు. టీడీపీ దిమ్మె, ఎన్టీఆర్ చిత్రపటం ధ్వంసానికి పాల్పడినవారిని గుర్తించి పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి బండ్ల శ్రీను, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతి కుమార్, వీరు, తిక్కా కొండలు, బొట్టు కోటేశ్వరరావు, మస్తాన్, అంజి పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ బొప్పన బ్రహ్మయ్య సంఘటనా ప్రదేశానికి చేరుకొని దిమ్మెను పరిశీలించి కేసు నమోదు చేశారు.



సత్తెనపల్లిలో విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల విధుల బహిష్కరణ

● సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్

సత్తెనపల్లి, జూలై 22 : సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో సోమవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని ఉప సంహరించు కోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.అనీల్‌కుమార్, న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, జొన్నగలడ్డ విజయకుమార్, రవి పాల్గొన్నారు.

గురజాలలీగల్: జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు బార్ అసోసియేషన్ గురజాల న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రవేశపెట్టిన సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు తమ విధులు బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, కేవీ నాగార్జున, కలివెల ప్రభుదాసు, వీఎస్వీ హనుమంతరావు, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, ఏ.శ్రీనివాసరావు, కొంగర హరిసత్యనారాయణ, హుస్సేన్‌ఖాన్, జ్ఞానసుందరి, ఎం శ్యామలాదేవి, కర్రా చినకోటేశ్వరరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాకోబు మృతి బాధాకరం

సత్తెనపల్లి రూరల్, జూలై 22 : యాకోబు మృతి బాధాకరమని టీడీపీ నాయకులు కొల్లు మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని బీమవరం ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త బంగారు యాకోబు సోమవారం మృతి చెందారు. కార్యకర్తల ద్వారా సమాచారం తెలుసుకున్న ఆయన యాకోబు భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ యాకోబు మృతి వార్త తెలుసుకొని కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పలువురు మండల టీడీపీ నాయకులు, గ్రామ టీడీపీ నాయకులు ఉన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షుడిగా సాయి

కారంపూడి, జూలై 22: ఆర్యవైశ్య యువజన సంఘ మండల అధ్యక్షుడిగా సముద్రాల సాయి, ప్రధాన కార్యదర్శిగా కాసుల శంకర్, కోశాధికారిగా కొమ్మూరు శ్రీనివాసరావు నియమితులయ్యారు. స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఆర్యవైశ్య నేతలు దుశ్శాలువలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ, దేవస్థాన అధ్యక్షుడు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కాసుల చలమయ్య, వాసవీ క్లబ్ నేత భవిరిశెట్టి రామారావు, పూర్ణచంద్రరావు, ఎస్‌పీఆర్ కృష్ణ, కొత్త అశోక్, కొలిశెట్టి మల్లికార్జునరావు, మాధవ తదితరులు పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు.. నగదు స్వాధీనం

పెదకూరపాడు, జూలై 22 : పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.81,525 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వీ వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కంభంపాడు ఊరు వెలుపల కొష్టంలో పేకాట ఆడుతున్న షేక్ నాగుల్‌మీరా, పాములపాడుకు చెందిన చెరుకూరి సాంబయ్య, అనంతవరంకు చెందిన బాణావత్ నాగరాజు అమరావతికి చెందిన ఆలా లక్ష్మీనారాయణ, నరుకుళ్ళపాడుకు చెందిన నల్లబోయిన శ్రీనివాసరావు, పెదపరిమికి చెందిన షేక్ ఖాశిం, సరిపూడి నాగార్జునలను పేకాట ఆడుతుండగా అరెస్టు చేసినట్టు తెలిపారు.

మలేరియా, డెంగీ నివారణ అందరి బాధ్యత

దుర్గి, జూలై 22: మలేరియా, డెంగీ నివారణ మనందరి బాధ్యత అని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వలపు సైదులు అన్నారు. సోమవారం మలేరియా నియంత్రణ మాసోత్సవం సందర్భంగా దుర్గిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సైదులు మాట్లాడుతూ ప్రజలు గృహ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు చేరి మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధులు వస్తాయన్నారు. అనంతరం దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మాచర్ల మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మయ్య, హెచ్ఈ శ్రీనివాసరావు, హెచ్‌వి లలితకుమారి, హెచ్ఎస్ రెహమాన్, హెచ్ఎ వాగ్యానాయక్, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మొక్కలతోనే జీవుల మనుగడ

సత్తెనపల్లి రూరల్, జూలై 22: మొక్కలతోనే జీవుల మనుగడని సాధ్యమని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జగదీష్‌గుప్తా తెలిపారు. మండలంలోని రామకృష్ణాపురం వద్దగల కేంద్రీయ విద్యాలయంలో సోమవారం ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవకోటికి అవసరమైన ప్రాణ వాయువును అందించేది మొక్కలేనన్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యాలయ సిబ్బంది కిరణ్‌రెడ్డి, రోహిత్ సౌరబ్, సౌజన్య, ఉమా మహేశ్వరి, ప్రత్యేక అతిథి సాధన గుప్తా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి, సంరక్షించాలి

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్

మాచర్ల రూరల్, జూలై 22: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ అన్నారు. మండలంలోని అచ్చమ్మకుంట తండాలో సోమవారం ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ధారునాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం జగన్ పర్యటలన సందర్భంలో చెట్లు నరకడమే పనిగా పెట్టుకుందన్నారు. కూటమి ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, పరిసరాల సుందరీకరణ చర్యల్లో భాగంగా మొక్కలు నాటడం, సంరక్షించడం వంటి చర్యలకు ప్రాధాన్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, దేవ్లానాయక్, లక్ష్మయ్య, భగత్, దుర్గయ్య, రామ్ సింగ్, జీవ్లానాయక్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పెదకూరపాడు, జూలై 22 : అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. గ్రామ సభలు నిర్వహించి భూ యజమాని అంగీకార పత్రాలతో సంబంధం లేకుండానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బంకా దాను, శ్రీనివాసరావు, బుజ్జి పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే !

రెంటచింతల, జూలై 22: రెంటచింతల రైల్వే స్టేషన్ రోడ్డు చిన్నపాటి చినుకులకే నీరు నిలబడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై నీరు నిలబడి దుర్గంధం రావడం, దోమలు, ఈగలు వృద్ధి చెందడం ద్వారా ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ బాధపడుతున్నారు. రహదారి ఆక్రమణలకు గురికావడంతో రహదారి అధ్వానంగా మారి గుంతలు పడిపోయాయి. దీంతో పాదచారులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి రోడ్ల విస్తరణచర్యలు, మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చిత్తడిగా మారిన రైల్వేస్టేషన్ రహదారి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణబాబు, ఇతర అధికారులు

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

● పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణబాబు

నరసరావుపేట టౌన్, జూలై 22: మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పీ అరుణబాబు అన్నారు. సోమవారం నరసరావుపేట పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 75మంది ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణబాబు మాట్లాడుతూ శ్రద్ధ, అంకితభావంతో పనిచేసి జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య అంశాలు, జిల్లాలో దృష్టిసారించాల్సిన అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో ఎటువంటి బాధాకర సంఘటనలు జరగకుండా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని పనులు చేపట్టాలన్నారు. జిల్లాలోని మండలాల ప్రత్యేక అధికారులు వారానికి ఒకరోజు సచివాలయాలు, పాఠశాలలు, హాస్టల్, రైతు సేవాకేంద్రాలు, ప్రభుత్వాసుపత్రులు తనిఖీ చేసి, సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో మాతృశాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్షించుకోవాలని అన్నారు. ఆయా హెచ్‌వోడీలు పీజీఆర్ఎస్ పోర్టులలో చూడని అన్ని కేసులను క్లియర్ చేయాలని, శాఖలలో కిందస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకొని ముందుకుసాగాలని అధికారులను ఆదేశించారు.

ఆర్‌యూబీల వద్ద భద్రతా సిబ్బంది ఏర్పాటు

నరసరావుపేట రూరల్, జూలై 22: గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పల్నాడు జిల్లాలోని 188 రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద ప్రయాణికుల భద్రత కోసం సిబ్బందిని నియమించారు. భారీ వర్షాల కారణంగా ఆర్‌యూబీల వద్ద వర్షపునీరు నిలిచిపోయినపుడు ప్రయాణికులను నిలిపివేయడం, 50 సెంటీమీటర్ల కంటే నీరు ఎక్కువగా ఉన్నపుడు ఆర్‌యూబీలలో ప్రయాణికులను నిలిపివేయడం తదితర అంశాలపై భద్రతా సిబ్బంది ఆర్‌యూబీల వద్ద ఉంటూ ప్రయాణికులకు సలహాలు ఇవ్వనున్నారు. పల్నాడు జిల్లాలో 188 ఆర్‌యూబీలలో 14 ఆర్‌యూబీలలో అధికంగా వర్షపునీరు నిలిచిపోతున్నదని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ఆర్‌యూబీలలో ప్రయాణించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

23 నుంచి ఆధార్ నమోదు కేంద్రాలు ప్రారంభం

వినుకొండ, జూలై 22: ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆధార్ నమోదు కోసం ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆధార్ లేనివారు మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని లాయర్ స్ట్రీట్ సచివాలయం, హనుమాన్‌నగర్-2 సచ్చివాలయాల్లో ఆధార్ ఎన్‌రోల్ క్యాంపును ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఎస్పీని కలిసిన గుంటూరు జిల్లా ప్రాసిక్యూషన్ డీడీ

నరసరావుపేట లీగల్, జూలై 22: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ పాతూరి మధుసూదనరావు సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావును కలిశారు. ఈ సందర్భంగా కేసులు త్వరిత గతిన పరిష్కారం కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీని శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీపీలు మల్లారెడ్డి, స్వర్ణలతా భాను, లక్ష్మీరామ్‌నాయక్, ఎన్ విజయ కుమార్, బుచ్చిదంతాచారి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీని సన్మానిస్తున్న డీడీ పాతూరి మధుసూదనరావు



గ్రామసభలో మాట్లాడుతున్న ఎస్ఆర్పీ రాజు

పంచాయతీ నిధులతో

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

● శావల్యాపురం మాజీ సర్పంచ్ ఐరామూర్తి

శావల్యాపురం, జూలై 22: ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు పని ప్రదేశాల్లో వసతులు సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంచాయతీ నిధులతోనైనా కూలీలకు తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, మజ్జిగ తదితర మౌలిక వసతులను కల్పించాలని శావల్యాపురం మాజీ సర్పంచ్ జుజ్జూరి ఐరామూర్తి అధికారులను కోరారు. 17వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా శావల్యాపురం పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ అధ్యక్షతన సోమవారం గ్రామసభను నిర్వహించారు. ఎస్ఆర్పీ రాజు, డీఆర్పీ శ్రీనివాసరావులు పాల్గొని 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా నిర్వహించిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. మాజీ సర్పంచ్ ఐరామ్మూర్తి మాట్లాడుతూ గ్రామసభలను ప్రజలకు అందుబాటులో ఉండేలా సెంటర్లలో నిర్వహిస్తే ఎక్కువమంది హాజరవుతారని, సమస్యలను అధికారులకు తెలియజేసేందుకు వీలుగా ఉంటుందన్నారు. తనిఖీల వివరాలు ముందుగా ప్రజాప్రతినిధులకు తెలియజేస్తే గ్రామసభలో లోటుపాట్లను ప్రశ్నించేందుకు వారికి అవగాహన ఉంటుదన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం అధికారులకు కేటాయించిన పనిదినాలు పూర్తిచేసేందుకు వాగుల్లో, చెరువుల్లో పూడికతీత పనులు పెట్టి నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, కూలీలతో పంట కాలువలు బాగుచేయిస్తే రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏపీవో కటారపు రామారావు, పంచాయతీ కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే భూసారం మెరుగు: సైదయ్య

ఈపూరు, జూలై 22: ప్రకృతి వ్యవసాయంతోనే భూసారాన్ని కాపాడుకోవచ్చునని ఎన్ఎఫ్ఏ సైదయ్య అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో దారా ప్రకాష్ రావు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సోమవారం సైదయ్య పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ భూమిలో కర్బనశాతం పెంచుకోవాలంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతిని పాటించాలన్నారు. దానివలన భూమిలో నీటిని నిలుపుకునే శక్తి ఉంటుందన్నారు. ప్రకాష్‌రావు సాగుచేసిన 30రకాల విత్తనాల వలన అతనికి లాభదాయకమన్నారు. పంటను పశువులకు మేతగా, ఆకుకూరలు ఉపయోగించుకోవచ్చన్నారు. అంతేకాకుండా భూమికి 6టన్నుల పోషక పదార్థం లభిస్తుందన్నారు. ఈ పద్ధతిని ప్రతి ఒక్క రైతు పాటిస్తే పంటలకు ఖర్చు తగ్గడమే కాకుండా చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ తిరుపతిరావు, భాస్కరరావు, లక్ష్మానాయక్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

నాటకరంగం నిర్వాహకులకు రూ.15 వేలు ఆర్థికసాయం

వినుకొండ, జూలై 22: ఈ నెల 17 తేదీన తొలి ఏకాదశి పండుగ సందర్భంగా పట్టణంలో ఏర్పాటుచేసిన సాంఘిక నాటకానికి నిర్వాహకులకు పట్టణానికి చెందిన యార్లగడ్డ బుజ్జి, స్నేహితుల సాయంతో రూ.15 వేలు ఆర్థికసాయం చేసినట్లు నాటక పరిషత్ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటణలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటక రంగానికి మద్దతుగా నిలిచి ఆర్థిక సాయం అందించిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మావురాల ఎల్లమ్మ తల్లికి బోనాలు

శావల్యాపురం, జూలై 22: మండలంలోని పోట్లూరు పంచాయతీ పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దనున్న మావురాల ఎల్లమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి బోనాల వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ మంగళవారం ఉదయాన్నే దేవాలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

చినుకు రాలితే చిత్తడే

● అస్తవ్యస్తంగా మురుగునీటి పారుదల వ్యవస్థ



తటాకంలా ఎన్‌జీవో కాలనీ ప్రధాన రహదారి



పల్నాడు రోడ్డు మార్జిన్‌లో నిలిచిన నీరు

నరసరావుపేట, జూలై 22: చినుకు రాలితే పట్టణం చిత్తడిగా మురుతున్నది. మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయి. కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. వర్షం కురిస్తే రోడ్లపై పడే వర్షం నీరు మురుగు కాలువల్లోకి ప్రవహించడం లేదు. మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని ప్రధాన వీధుల్లో మురునీరు రోడ్లపై ప్రవహిస్తున్నది. కాలువల్లో పూడిక తీయడంలేదు. ఎక్కడికక్కడ కాలువలు పూడిపోయాయి. రోడ్డు మార్జినులు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో వర్షపునీరు కాలువల్లో ప్రవహించడంలేదు. రోడ్డు మార్జిన్‌లు తటాకాలను తలపిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో మార్జిన్‌లలో ఉన్న అక్రమణలు తొలగిస్తే మురుగునీటి సమస్యలు తీరే అవకాశం ఉంది. పల్నాడు రోడ్డులో కూడా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వర్షాకాలంలో మురుగునీటితో ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి. మునిసిపల్ అధికారులు మురుగునీటి సమస్యల పరిష్కారంలో స్పందిస్తున్న దాఖలాలు లేవు. మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని పురపౌరులు కోరుతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి.

సింగర చెరువుకు చేరిన సాగర్ జలాలు

● ఎమ్మెల్యే జీవీ చొరవపై పట్టణ వాసుల హర్షం

● క్రమం తప్పకుండా తాగునీటిని అందిస్తామన్న అధికారులు

వినుకొండ టౌన్, జూలై 22: పట్టణ ప్రజలకు తాగునీరు అందించే సింగర చెరువుకు ఆదివారం నుంచి సాగర్ జాలాలు ప్రవేశించడంతో పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గత ప్రభుత్వం హయాంలోని పాలకులు చెరువు నీటిపై శ్రద్ధ చూపకపోవడం, సార్వత్రి ఎన్నికల నేపథ్యంలో అధికారులు తీరికలేకుండా ఉండడంతో చెరువునీరు అడుగంటాయి. ఎన్నికల ఫలితాలు వెలుబడే నాటికి చెరువుల్లో నీరు డెడ్ స్టోరేజి చేరుకుంది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అధికారులతో సింగర చెరువును పరిశీలించారు. మురికినీటితో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రహించారు. మున్సిపాలిటీ ఖాతాలో నిధులు లేకున్నా, ప్రజలకు తాగునీరు అందించేందుకు చొరవ తీసుకున్నారు. నూతనంగా జిల్లా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ అరుణబాబును వినుకొండకు పిలిపించారు. చెరువులో నీటి పరిస్థితిని చూపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా గుండ్లకమ్మ నదీ జలాలను ట్యాంకర్ల సాయంతో వినుకొండకు తాగునీటిని సరఫరా చేపట్టారు. వినుకొండ తాగునీటి సమస్యపై రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో చర్చించారు. వెంటనే స్పందించిన మంత్రి అధికారులతో చర్చించి, తాగునీటి అవసరాల నిమిత్తం చెరువుకు నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఈ నెల 17వ తేదీన సాగర్ నీటిని అధికారులు విడుదల చేశారు. బుగ్గవాగుకు చేరుకున్న తాగు నీటిని, సాగర్ కుడికాలవ ద్వారా, పెరుమాలపల్లి మేజర్ కాలువ నుంచి ఆదివారం సింగర్ చెరువుకు సాగర్ జలాలు చేరడంతో పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో నాలుగు, ఐదు రోజుల్లో ఉప్పరపాలెం వద్ద ఉన్న సింగర చెరువు నిండే అవకాశం ఉంది. ఎమ్మెల్యే చొరవతో తాగునీటికి సమస్య తొలగిందని పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక నుంచి రోజు వారీగా పట్టణ వాసులకు తాగునీటిని విడుదల చేస్తామని డీఈఈ వెంకయ్య సోమవారం తెలిపారు.



సింగర చెరువులోకి ప్రవేశిస్తున్న సాగర్ జలాలు

సాగర్ నీటిలో చేపలు

నాగార్జున సాగర్ నుంచి అధికారులు తాగునీరు విడుదల చేయడంతో చేపలు పెద్ద మొత్తంలో కొట్టుకు వస్తున్నాయి. సాధారణంగా చెరువుల్లో పెంచే చేపల కంటే, సాగర్ నీటి చేపలకు మంచి డిమాండ్ ఉంది. దీంతో వినుకొండ నియోజకవర్గంలోని జాలరులు చేపలు పట్టుకునేందుకు పోటీ పడుతున్నారు. వినుకొండ సింగర్ చెరువుకు వచ్చే నీటిలో కేజీ, రెండు కిలోల చేపలు దొరుకుతుండటంతో చెరువు కాలవ వద్దకు జాలర్లు కుటుంబాలతో చేరుకుంటున్నారు.

కలెక్టర్ సీసీ లైంగిక వేధింపులపై ఫిర్యాదు

నరసరావుపేట టౌన్, జూలై 22: పల్నాడు జిల్లా కలెక్టర్ సీసీ జానీ బాషా లైంగికంగా వేధిస్తున్నాడని కలెక్టర్ బంగ్లాలో పనిచేస్తున్న ఓ మహిళ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జానీబాషా గత ఆరు నెలలుగా తనను లైంగికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లాలో పనిచేయాలంటే ఒకసారి తన గదికి ఒంటరిగా రావాలని వేధిస్తున్నాడని ఆరోపించారు. విచారణచేసి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. తనపై ఎక్కడైనా ఫిర్యాదు చేస్తే తీవ్ర ఇబ్బందులు పడతావని బెదిరిస్తున్నాడని, గతంలో డీఆర్‌వోకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఫిర్యాదు చేస్తే ఉద్యోగాలు తీసేస్తానని బెదిరిస్తున్నాడని ఆమె ఆరోపించారు.

పరిష్కార వేదికకు ఫిర్యాదుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కే శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, జూలై 22: పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎస్పీ కే శ్రీనివాసరావు ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపారు. నిమ్మతోటకు చెందిన పాశం వనిత తన భర్తతరపు పరస్పర ఒప్పందంతో విడాకులు తీసుకున్నామని, ఒప్పందం కుదుర్చుకొని ఒప్పందంప్రకారం డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. పలువురు ఫిర్యాదుదారులు తమ వద్ద నగదు తీసుకొని అడిగితే బెదిరిస్తునట్లు ఫిర్యాదులు చేశారు. బరంపేటకు చెందిన తిరుమశెట్టి గౌరి తాను ప్రేమ వివాహం చేసుకున్నానని, ఇటీవల తన భర్త తాగివచ్చి బెదిరిస్తున్నాడని, అతని కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉన్నట్లు ఫిర్యాదు చేశారు.

వైభవంగా శ్రవణా నక్షత్రం పూజలు

నరసరావుపేట అర్బన్, జూలై 22: నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు జరిగాయి. భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.



కలెక్టర్ అరుణబాబును సత్కరిస్తున్న మాజీ జడ్పీ చైర్మన్ రాయపాటి శ్రీనివాసరావు, జనసేన నేత సయ్యద్ జిలానీ

కలెక్టర్‌ను కలిసిన రాయపాటి, జిలానీ

నరసరావుపేట టౌన్, జూలై 22: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పీ అరుణబాబును సోమవారం మర్యాదపూర్వకంగా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాయపాటి శ్రీనివాసరావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన అధికార ప్రతినిధి షేక్ అబ్దుల్ రహూఫ్, పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, ఎస్‌కే జిలానీ మాలిక్, మిరియాల సోమశంకర్, రామారావు, సైదా, భాషా, మస్తాన్‌వలి, శ్రీనివాసరావు, కొండలరావు, హనుమంతరావు, షేక్ ఖాజా, జనసైనికులు పాల్గొన్నారు.



రిజిస్ట్రారు కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న బరంపేట వాసులు

రిజిస్ట్రారు కార్యాలయాన్ని మార్చాలంటూ నిరసన

నరసరావుపేట టౌన్, జూలై 22: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని ప్రకాషనగర్‌లో అద్దె భవనంలో ఉన్న జిల్లా రిజిస్ట్రారు కార్యాలయాన్ని నూతనంగా నిర్మించి ప్రభుత్వ భవనంలోకి మార్చాలని బరంపేటకు చెందిన కొందరు యువకులు డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా రిజిస్ట్రారు కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా షేక్ అల్లాభక్షు మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాల నుంచి జిల్లా రిజిస్ట్రారు కార్యాలయాన్ని అద్దెభవనంలోనే నిర్వహిస్తున్నారని అన్నారు. ఇప్పుడు కొత్త భవనం నిర్మించినా కార్యాలయాన్ని మార్చకుండా ఉండటంతో ప్రభుత్వం అద్దె రూపంలో లక్షల రూపాయలలో నష్టపోవాల్సి వస్తుందన్నారు. షేక్ అబ్బాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చొరవ చూపి కొత్త భవనంలోకి మార్చాలని కోరారు. కొత్త భవనంలోకి మార్చడం వల్ల బరంపేట ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ట్రాఫిక్ సమస్యకు కొంత ఉపశమనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జమ్ముల జగదీశ్, సయ్యద్ మహమ్మద్, బ్రహ్మారెడ్డి, బుడె, పెద్దన్న, మహమ్మద్ రఫీ, షేక్ హుస్సేన్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ఫణి సుష్మకు పీహెచ్‌డీ

నరసరావుపేట రూరల్, జూలై 22: జేఎన్‌టీయూ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ నరసరావుపేట క్యాంపస్ మెకానికల్ విభాగాధిపతిగా పనిచేస్తున్న ఐ ఫణి షుష్మకి మెకానికల్ బ్రాంచ్‌లో పీహెచ్‌డీ పట్టా లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆమె తన పీహెచ్‌డీ ఇన్వెస్టిగేషన్స్ ఇన్ టూ పెర్ఫార్మన్స్ ఆఫ్ టెక్ట్ అండ్ చంపర్డ్ పీసీడీ కటింగ్ ఇన్సర్ట్స్ డ్యూరింగ్ హై స్పీడ్ మెషిన్ ఆఫ్ ఏఎల్ 6061' అనే శీర్షికతో అధ్యయనం సమర్పించారు. ఈ అధ్యయనంపై ఐఐటీ మద్రాస్ నుంచి పీహెచ్‌డీ పట్టా లభించిందన్నారు. ప్రొఫెసర్ జీఎల్ శామ్యూల్ పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారన్నారు. ఈ నెల 19వ తేదీన ఐఐటీ మద్రాస్‌లో 61వ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఐ.ఫణి షుష్మకి అభినందనలు తెలిపారు.



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న ఫణి సుష్మ

రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో శిక్ష సప్తాహం

రొంపిచర్ల, జూలై 22: మండలంలోని రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో శిక్ష సప్తాహ కార్యక్రమం సోమవారం జరిగింది. ప్రిన్సిపాల్ రవినాయక్ మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో, ఖర్చులేని నిరుపయోగమైన వస్తువులతో ఉపాధ్యాయులు వందకుపైగా వివిధ సబ్జెక్టులకు సంబంధించి బోధనోపకరణాలను తయారు చేశారు. సెమినార్లు, ప్రాజెక్టులను నిర్వహించారు. విద్యార్థులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపకరణాలు తయారుచేశారు. కార్యక్రమం విజయవంతం కావటానికి సహకరించిన ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు.

నేటి నుంచి తురుమెళ్ళలో ఆధార్ నమోదు క్యాంపు

రొంపిచర్ల, జూలై 22: మండలంలోని తురుమెళ్ళ గ్రామంలో ఆధార్ నమోదు క్యాంపును నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లక్ష్మీకుమారి సోమవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నిరు పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఒయాసిస్ ఆర్గనైజేషన్ సభ్యులు

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దటమే లక్ష్యం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 22: రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా చిలకలూరిపేటను తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆర్థికసాయం, పేద మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే కందిమళ్ళ జయమ్మ పర్యవేక్షణలో పండరీపురంలో ఆదివారం జరిగింది. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో ఆర్యవైశ్యులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అభివృద్ధి అంటే తెలుగుదేశం, చంద్రబాబు అని, అందుకు తమ నియోజకవర్గమే నిదర్శనమన్నారు. వైసీపీ హయాంలో వైఫల్యాలకు చెంపపెట్టుగానే నియోజకవర్గ చరిత్రలో గుర్తుండిపోయేలా ప్రజలు తీర్పును ఇచ్చారని, మరీ ముఖ్యంగా మహిళలు తెలుగుదేశం పార్టీ కూటమికి అఖండ విజయం అందించారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో తీసుకు వచ్చిన అనేక ప్రాజెక్టులు, కార్యక్రమాలు వైసీపీ ప్రభుత్వంలో ఆగిపోయాయని, ఇప్పుడు వాటిని పూర్తిచేసి ఎలాంటి లోటు లేకుండా చూస్తామన్నారు. దాతలు ముందుకు వస్తే పేదలకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు కందిమళ్ళ జయమ్మ చేస్తారన్నారు. ఆమె ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా ప్రజల కోసం అనేక పనులు చేశారని, వైద్య శిబిరాల ద్వారా ఎంతో మంది పేదలకు వైద్య సేవలు అందించాని ప్రత్తిపాటి కొనియాడారు. ఇప్పుడు తిరిగి ఒయాసిస్ సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, ఈ సంస్థకు రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయని, అందుకు ఒయాసిస్ ఆర్గనైజేషన్ సభ్యులకు ప్రత్తిపాటి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ

నాదెండ్ల, జూలై 22: నరసరావుపేట ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాతులూరు గ్రామంలోని బాలభారతీ స్కూల్ డైరెక్టర్ జంపని లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఆయనను నరసరావుపేటలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా కొల్లి బ్రహ్మయ్య, ఈఎం స్వామి, రాజారెడ్డిలు వ్యవహరించారు. ఎన్నికైన ఆయనను గ్రామస్థులు అభినందించారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

నాదెండ్ల, జూలై 22: మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన సలగల మణి అనే వివాహిత తనను వరకట్నం కోసం వేధిస్తున్నారంటూ చేసిన ఫిర్యాదు మేరకు నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడాది క్రితం బాపట్లకు చెందిన బెంజ్‌మెన్‌తో ఆమెకు వివాహం జరిగింది. కట్నం తేవాలంటూ భర్త బెంజ్‌మెన్, మామ లూథర్, అత్త ఎస్తేరు తదితరులు వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు నాదెండ్ల పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు.

నలుగురు జూదరుల అరెస్టు

నాదెండ్ల, జూలై 22: మండలంలోని నాదెండ్ల గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురిని ఎస్ఐ జే బలరామిరెడ్డి అరెస్టు చేశారు. నాదెండ్ల-లింగారావుపాలెం వెళ్ళే దారిలోని కోతముక్క ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం రావటంతో వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 960 నగదును స్వాధీనం చేసుకున్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

యడ్లపాడు, జూలై 22: మండంలోని కొండవీడు గ్రామంలో సెరీ కల్చర్, పండ్ల తోటల పెంపకంపై సోమవారం అవగాహన కల్పించారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా సెరీ కల్చర్ అధికారి బాల సుబ్రహ్మణ్యం మల్బరీ తోటలు, ఉద్యానవన తోటలు పెంచుకోవాలనే విషయంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం: డీపీఎంకే

యడ్లపాడు, జూలై 22: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు నిరంతర ఆదాయం వస్తుందని డీపీఎంకే అమల కుమార్ తెలిపారు. మండలంలోని చంఘీస్‌ఖాన్‌పేట గ్రామంలో ఆమె పత్తి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తిలో అంతర్ పంటల విధానం వల్ల రైతులకు పెట్టుబడి తగ్గి నికర ఆదాయం పెరుగుతుందన్నారు. సాలుకు సాలుకు మధ్య బెండ, గోరుచిక్కుడు, అనుములు, పెసర తదితర అంతర్ పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతు నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డెంగీ, డయేరియాపై అవగాహన ర్యాలీ

రొంపిచర్ల, జూలై 22: మండలంలోని రైతునగర్‌లో సోమవారం డెంగీ, డయేరియాపై అవగాహన ర్యాలీ జరిగింది. వైద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. రోజుల తరబడి జ్వరం ఉన్న వారు సమీప సబ్ సెంటర్‌ను లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల ఇంజనీరింగ్‌లో తరగతులు ప్రారంభం

నరసరావుపేట రూరల్, జూలై 22: స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతులు సోమవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ వేడుకకు విద్యార్థులు, వారి తల్లితండ్రులు హాజరయ్యారు. ఫౌండర్ కళాశాల ప్రిన్సిపాల్ డా వైవీనారాయణ అధ్యక్షతన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, వైస్ చైర్మన్ బత్తిన నాగేశ్వరరావు, సెక్రటరీ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ డా.నల్లబోతు వెంకట్రావు, దండా బ్రహ్మానందం పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు తాము కళాశాల స్థాపించిన ప్రధాన లక్ష్యం, కళాశాలలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. తమ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఎంతో ఉన్నతమైన కంపెనీలలో అత్యధిక ప్యాకేజీలతో ఉద్యోగాలు నిర్వహిస్తున్నారన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

పెదకూరపాడు, జూలై 22: పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టుచేసి వారి వద్ద నుంచి 81,525 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వీ వెంకటరావు సోమవారం తెలిపారు. మండలంలోని కంభంపాడు ఊరు వెలుపల కొష్టంలో పేకాట ఆడుతున్న మండలానికి చెందిన షేక్ నాగుల్ మీరా, పాములపాడుకు చెందిన చెరుకూరి సాంబయ్య, అనంతవరంనకు చెందిన బాణావత్ నాగరాజు అమరావతికి చెందిన ఆలా లక్ష్మీనారాయణ, నరుకుళ్ళపాడుకు చెందిన నల్లబోయిన శ్రీనివాసరావు, పెదపరిమికి చెందిన షేక్ ఖాశిం, సరిపూడి నాగార్జున్‌లను పేకాట ఆడుతుండగా అరెస్టు చేసినట్టు ఆయన వివరించారు.

నకరికల్లులో తొమ్మిది మంది...

● నకరికల్లు: నకరికల్లు నుంచి ఇనిమెట్ల వెళ్ళే మార్గంలో డంపింగ్ యార్డు వద్ద పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని సోమవారం అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ 4,120 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కే నాగేంద్రరావు తెలిపారు.